ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 22 ఫిబ్రవరి 2025



సమన్వయంతో సాగండి
● పీవోలను మైక్రో అబ్జర్వర్లు సమన్వయం చేసుకోవాలి ● ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

బ్యాంకులను బతికించండి
8
● గుంటూరులో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

ప్రతి ఓటూ.. ప్రతిష్ఠాత్మకమే



- కొత్తగా చేరిన లక్ష ఓట్లు ● గత ఎన్నికలో చెల్లనవి అధికం
- కలసి కదులుతున్న కూటమి నేతలు
- సిట్టింగ్ స్థానం నిలుపుకునేందుకు పీడీఎఫ్ యత్నాలు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు శ్రేణులతో సమీక్షలు
- పట్టభద్రులను కలసి మద్దతు కోరుతున్న అభ్యర్థులు

(నరసరావుపేట, గుంటూరు- ఆంధ్రజ్యోతి)

కృష్ణా.. గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. అధికారంలో ఉండటం. శాసనసభ ఎన్నికల్లో స్వీప్ చేయడంతో ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా కైవశం చేసుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కూటమి బరిలో దింపింది. కూటమి హైకమాండ్ నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. అదే విధంగా సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు పీడీఎఫ్ సర్వశక్తులు ఒడ్డుతోం ది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును పీడీఎఫ్ పోటీలో నిలిపింది. ఇటు కూటమి.. అటు పీడీఎఫ్ పట్ట భద్రులైన ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాత్మకం గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి.

ప్రతి ఓటూ కీలమే..

2019 పట్టభద్రుల ఎన్నికల్లో గతంలో చెల్లని ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని, ఈ సారి అభ్యర్థులు ప్రతి ఓటు చెల్లేలా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. గత ఎన్నికల్లో 13,509 ఓట్లు చెల్లలేదు. 2,48,799 ఓట్లు ఉండగా 1,49,319 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 60 శాతం ఓట్లు మాత్రమే పోలు కావడంతో ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచే దిశగా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటుకు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు. చెల్లని ఓట్ల సంఖ్య తగ్గించే దిశగా కూడా అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఓటు వేసే విధానంపై కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ముఖ్య నేతలకు లోకేష్ ఫోన్

యువనేత నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి అసెంబ్లీ స్థానం కూడా ఈ ఎన్నికల పరిధిలో ఉండటంతో ఆయన కూడా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కూటమి అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తున్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లోని ముఖ్య నేతలకు ఆయన నేరుగా ఫోన్ చేసి పార్టీ అభ్యర్థి విజయం కోసం శ్రమించాల్సిందిగా ఆదేశిస్తున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్న మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా రాజా గెలుపు కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. వీరితో పాటు ఇతర జిల్లాలకు చెందిన టీడీపీ సీనియర్ నేతలు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రి పరిటాల సునీత తనయుడు పరిటాల శ్రీరామ్ తదితరులను కూడా యువనేత లోకేశ్ రంగంలోకి దించి ప్రచారం నిర్వహింప చేస్తున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని జనసేన, బీజేపీ నేతలు కూడా ఇప్పటికే తమ నియోజకవర్గాల్లో పలు మార్లు సమావేశాలు నిర్వహించి రాజాను గెలిపించాల్సిందిగా కోరటం జరిగింది.

కొత్తగా చేరిన లక్ష ఓట్లు

2019తో పోలిస్తే ఈ సంవత్సరం లక్ష ఓట్లు కొత్తగా చేరాయి. 2019లో 2,48,799 ఓట్లు ఉండగా, ఈ సంవత్సరం 3,47,116 ఓట్లు నమోదయ్యాయి. 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఓట్లు 25 ఉన్నాయి. కూటమి వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలను నిర్వహించి పట్టభద్రుల ఓట్లు చేర్చుకొనేందుకు సహకరించింది. దీంతో ఓట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఉత్సాహం ఉన్నవారే ఓటు నమోదు చేసుకునేవారు. ఈ సారి నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాల కూడా ఓటర్ల సంఖ్య పెరగడానికి కారణమయింది. మొత్తం మీద పెరిగిన ఓట్లు ఏ అభ్యర్థికి అనుకూలంగా మారతాయో చూడాలి.

ప్రచారంలో బిజీగా నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో అన్ని పార్టీల అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కూటమి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవశం చేసుకొనేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఉన్న ఓట్లను ప్రాతిపదికగా చేసుకొని ఒక ఇన్‌చార్జిని నియమిం చడంతో పాటు ప్రతి 30 మంది ఓటర్లకు ఒక బాధ్యుడుని ఏర్పాటు చేసి ఓటర్లను కలిసే కార్యక్ర మం చేపట్టింది. ఇప్పటికే కొన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రతి ఓటరుని కూటమి శ్రేణులు కలసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరిస్తూ మద్దతు కూడగడుతున్నారు. ప్రతి అసెంబ్లీ నియో జక వర్గానికి ఒక ఎన్నికల పరిశీలకుడిని కూటమి నియమించింది. వీరు ఎప్పటికప్పుడు ప్రచార సరళిని సమీక్షిస్తున్నారు. ప్రచారంలో ఎక్కడైనా లోటు పాట్లు ఉంటే పరిశీలకులు సరిదిద్దుతున్నారు. ఒక్కొక్క ఓటరును రెండు సార్లు అయినా కలసి సానుకూల ఓటింగ్ జరిగేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తు న్నారు. టీడీపీ సెంట్రల్ కార్యాలయం నుంచి కూడా ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిపై సమీక్షలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆలపాటిని గెలిపించాలని స్వయంగా వారు పట్టభద్రులను కలసి ఓటు అభ్యర్థిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, న్యాయవాద సంఘాలను కలసి జగన్ పాలనలో ఉద్యోగ వర్గాలకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమా లను వివరిస్తున్నారు. కూటమి, పీడీఎఫ్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారడంతో ఆలపాటి రాజా.. లక్ష్మణరావు మధ్య పోటీ రసవత్తరంగా మారింది.

రోస్టర్‌లో.. తప్పులు నిరుద్యోగులకు తిప్పలు

● రోస్టర్ ప్రకటనలో లోపాలపై అభ్యర్థుల్లో కలవరం

ఈ నెల 23వ తేదీన ప్రారంభం కానున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు, గ్రూప్-2 అభ్యర్థులు వేడుకొంటు న్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్- 2 నోటిఫికేషన్ లోపభూయిష్టంగా ఉందని, నోటిఫికేషన్‌పై నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ నోటిఫికేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరిగితే మెరిట్ అభ్యర్థులు తీవ్ర అన్యా యానికి గురవుతారని వారు ఆందోళన చెందుతున్నారు. రోస్టర్ సరిచేసేంత వరకూ మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలంటూ రెండు రోజులుగా గుంటూరులో ఆందోళనలు చేస్తున్నారు. సరిగ్గా మెయిన్స్ పరీక్షకు ఒక్కరోజు ముందు, శుక్రవారం ఉదయం గుంటూరు కలెక్ట రేట్ ఎదుట వందల మంది అభ్యర్థులు ఆందోళనకు దిగారు.

ప్రభుత్వం పట్టించుకోవాలంటూ రోడ్డెక్కిన అభ్యర్థులు



గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రూపు- 2 అభ్యర్థులు

- ఎన్నికలకు ముందు హడావుడిగా గత ప్రభుత్వం నోటిఫికేషన్
- గత ప్రభుత్వం తెచ్చిన జీవో. నెం. 77తో మరింత గందరగోళం
- సరిచేయాలని కొంతకాలంగా నిరుద్యోగుల అభ్యర్థన
- రెండు రోజుల్లో మెయిన్స్.. వాయిదా కోరుతూ ఆందోళన
- గుంటూరు కలెక్టరేట్ వద్ద నిరసనలు

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావుడిగా గ్రూప్-2 నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పిన గత ముఖ్యమంత్రి ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా, ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా ఎన్నికలకు ముందు నిరుద్యోగులను బుజ్జగించడానికి, వారి ఓట్లు పొందడానికి అన్నట్లుగా ఎన్నికలకు ముందు హడావుడిగా గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ చూసుకున్న నిరుద్యోగులు ఆందోళ నకు గురయ్యారు. నోటిఫికేషన్లో ప్రకటించిన రోస్టర్ పాయింట్లు తప్పుల తడకగా ఉన్నట్లు గుర్తించి, వాటిని సరిచేయాలని ఆందోళన చేపట్టారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్సీలు కూడా రోస్టర్ తప్పులను ప్రభు త్వానికి ఎత్తి చూపారు. అయిన ప్పటికీ యథావిధిగా గ్రూప్- 2 ప్రిలిమ్స్ పరీక్షలు జరిగిపోయాయి. ఆ తరువాత ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ బోర్డులో మార్పులు జరిగాయి. దీంతో గ్రూప్- 2 నోటిఫికేషన్లో దొర్లిన తప్పులను ఏపీపీఎస్సీ సరిచేస్తుందని భావించారు. కానీ ఆ దిశగా ఏమీ జరగలేదు. దీంతో ఆందోళన చెందిన పలువురు గ్రూప్- 2 అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారిస్తున్న హైకోర్టు రోస్టరుపై నిర్దిష్టమైన తీర్పు ఏదీ ఇవ్వలేదు. కానీ పరీక్షల నిర్వహణను యథావిధిగా ఈనెల 23 నుంచి కొనసాగించుకోవచ్చని సూచిం చింది. అప్పటి వరకూ కోర్టుపైనే ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు కోర్టు తీర్పుతో తీవ్ర కలవరానికి గురయ్యారు. ఆందోళనబాట పట్టారు.

● గత ప్రభుత్వం తెచ్చిన జీవోతో తంటా..

గత ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్లపై 2023 ఆగస్టులో జీవో. ఎంఎస్. నెం.77ను జారీ చేసింది. రిజర్వేషన్లలో భాగంగా మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్ మెన్‌లకు సంబంధించి వర్టికల్ రిజర్వేషన్‌ను అందులో ప్రకటించింది. జీవో ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థుల ఎం పికలో మహిళలకు కేటాయించిన 33.33 శాతం వర్టికల్ రిజర్వేషన్‌ను అమలు చేస్తారు. అంటే ఆయా కేటగిరీలు, సబ్ కేటగిరీల్లో ఎంపిక చేసే అభ్యర్థుల్లో మూడో వంతు మహిళలకు కేటాయి స్తారు. ఇది గతం నుంచి అమలులో ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం దీని కోసం ప్రత్యేకమైన జీవో తెచ్చింది. ఆ జీవోలో రోస్టర్ పాయింట్లను ప్రకటించింది. గతంలో అమలులో ఉన్న జీవో ప్రకారం వంద పాయింట్ల రోస్టర్ విధానంలో హారిజాంటల్ రిజర్వే షన్లో భాగంగా ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు పోస్టులు కేటాయిస్తారు. అందులోనే వర్టికల్ రిజర్వేషన్ కోటా కింద 1/3 వంతు మహిళల కోటా పోస్టులు కూడా ప్రకటిస్తారు. ఆ వంద పాయింట్ల రోస్టర్ లోనే జనరల్ ఎన్ని, మహిళలు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్ అభ్య ర్థులకు ఎన్ని అనేది స్పష్టంగా ఉంటుంది. కానీ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పోస్టుల ఎదుట హారిజాంటల్ కేటగిరీ పోస్టులను ప్రకటించలేదు. దీం తో వర్టికల్ రిజర్వేషన్‌పై గ్రూప్-2 నోటిఫికేషన్లో గందర గోళం నెలకొంది.

● ఆందోళనకు కారణం..

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన గ్రూప్- 2 నోటిఫికేషన్లో ఉన్న మొత్తం పోస్టుల్లో 45 శాతం పోస్టులు మహిళలకే కేటాయించి ఉన్నాయని అభ్యర్థులు

(మిగతా 6వ పేజీలో)

● వైసీపీ నిర్వాకంతో.. నిరుద్యోగుల్లో నిస్పృహ

గత వైసీపీ ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి, ఐదేళ్లలో ఒక్క ఏడాది కూడా క్యాలెండర్ విడుదల చేయ లేదు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు హడావుడిగా 2023 డి సెంబరు 7న గ్రూప్- 2 నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో కూడా నామమాత్రంగా 905 పోస్టులు మాత్రమే ఉన్నాయి. అందులో కీల కమైన గెజిటెడ్ పోస్టులు మున్సిపల్ కమిషనర్ 4, సబ్ రిజిస్ట్రార్ 16, లేబర్ ఆఫీ సర్ 28, పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ 2, కోఆపరేటివ్ సొసైటీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ 16 పోస్టులు ఉండగా, డిప్యూటీ తహసీల్దార్ 114, ఎక్సైజ్ ఎస్సై 150 మాత్రమే ఉన్నాయి. డీటీ, ఎక్సైజ్ ఎస్సై పోస్టులు మినహా మిగిలిన అన్ని పోస్టుల్లో జనరల్ కేటగిరీకి, మహిళా కోటాకు సమానంగా పోస్టులు వస్తున్నాయి. ఐదేళ్ల తరువాత వచ్చిన నోటిఫికేషన్లో నామమాత్రంగానే పోస్టులు ఉండడం, అందులోనూ రిజర్వేషన్ లేకుండా పోవడంతో అభ్యర్థులు నిరాశకు గురవుతున్నారు. ఇదే పద్ధతి కొనసాగితే భవిష్యత్తులో వెలువడే నోటిఫికేషన్లలో కూడా తమకు మేలు జరగదన్నా నిస్పృహ వారిని వెంటాడుతోంది.

ఖరీఫ్ నాటికి.. కడగండ్లు తీరేనా?

- మరమ్మతుల కోసం కృష్ణాడెల్టా కాల్వల ఎదురుచూపు
- గత ఐదేళ్లలో తట్ట మన్నేసింది లేదు
- కట్టలన్నీ గండ్లుపడేంత బలహీనంగానే
- షట్టర్‌లు, కాంక్రీట్ స్ట్రక్చర్‌లయితే పూర్తిగా శిథిలమే
- అత్యవసర రిపేర్లకు ఓ.అండ్.ఎం నిధులు సరిపోవు
- ప్రత్యేక నిధుల మంజూరు చెయ్యాల్సిందే


8

తెనాలి: కంచర్లపాలెం వద్ద పంట కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పిచ్చి కాడ

ఏ కాల్వ కట్ట చూసినా.. ఏమున్నది గర్వకారణం అన్నట్టుంది కృష్ణా పశ్చిమ డెల్టాలోని కాల్వల పరిస్థితి. అంతా కడ'గండ్ల'మయమే. వీటి మరమ్మతులకు రూ. 40 కోట్ల నుంచి రూ. 50 కోట్ల వరకు నిధులు అవసరమౌతాయని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఇంతవరకు సకాలం లోనే జరిగింది. వెంటనే అనుమతులు మంజూరు చేస్తే టెండర్ల ప్రక్రియను ఏప్రిల్లోపే పూర్తి చేసుకునే అవకాశం ఉంది. అప్పటినుంచి జులై వరకు పనులు చేసుకోవచ్చు. ప్ర త్యేక నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతుండగా, ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే..

సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి

● మంత్రి గొట్టిపాటి రవికుమార్ ● వైదనలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



వైదనలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి రవికుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. శుక్రవారం బల్లికురవ మండలంలోని వైదన గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. అలాగే ముస్లింలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.50లక్షలతో చేపట్టనున్న షాదీఖానా నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సార్వత్రిక ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వరుస క్రమంలో అమలు చేస్తున్నామన్నారు. జూన్‌లో విద్యార్థులకు తల్లికి వందనం కింద నగదు జమచేస్తామన్నారు. అలానే రైతులకు పెట్టుబడి సాయం అందించే చర్యలు మొదలు పెట్టామన్నారు. వైదన గ్రామంలోని వసతి గృహం అభివృద్ధికి రూ. 50 లక్షల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అలానే గ్రామ పంచాయతీల నిధులను గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన మాదిరిగా మట్టి రోడ్లకు వాడకుండా ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు తమకు పింఛన్లు రావటం లేదని మంత్రికి అర్జీలు సమర్పించారు. వైదన ఉర్దూ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమాలలో విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, పీఆర్ డీఈ విఠల్‌నాయక్, మండల పార్టీ నేతలు పోగుల శేఖర్, కొండేటి ఇశ్రాయల్, మలినేని గోవిందరావు, జాష్టి వెంకటనారాయణబాబు, గొట్టిపాటి లక్ష్మయ్య, కోట శ్రీనివాసరావు, గొట్టిపాటి శంకర్, యాగంటి సింగరయ్య, దేవినేని శివయ్య, టీడీపీ గ్రామ నేతలు ఏలూరి శ్రీను, తిరుమలశెట్టి సుబ్బారావు, గాలం శ్రీనివాసరావు, గాలం నిమ్మయ్య, షేక్ గోపి, భూడే, తదితరులు పాల్గొన్నారు.అద్దంకి నియోజకవర్గంలోని బొడ్డువానిపాలెం, అద్దంకి, కొమ్మాలపాడు, కొప్పెరపాడు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ వైదన గ్రామంలో ఉచితంగా బ్యాటరీ చార్జింగ్ సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వైదనలో పీహెచ్‌సీ పెట్టండి.. స్థలం ఇస్తాం

మండలంలోని కొప్పెరపాడు గ్రామానికి పీహెచ్‌సీ మంజూరు అయి స్థలం లేక ఇంతవరకు ప్రారంభించ లేదని, వైదన గ్రామంలో స్థలం ఇస్తామని, మా గ్రామానికి పీహెచ్‌సీని తరలించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వైదన గ్రామస్థులు విన్నవించారు. రెండేళ్లుగా స్థలం లేక పీహెచ్‌సీ గాలిలో ఉందని తాము పీహెచ్‌సీకి అవసరమైన స్థలాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, పరిశీలించాలని వారు మంత్రికి వినతిపత్రం అందించారు.

గుడ్డుకాయ స్వాహా



బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళాకు జనం పోటెత్తారు.

8

అంబేడ్కర్ ప్రపంచ మేధావి



ప్రసంగిస్తున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య గంటా చక్రపాణి

పెదకాకాని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి దశా, దిశా చూపిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా కీర్తి పొందారని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య గంటా చక్రపాణి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ విజన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో, పొలిటికల్, ఎకనామిక్ ఫ్యాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆచార్య గంటా చక్రపాణి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రోగ్రెసివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుగా ఆయన అభివర్ణించారు. ముఖ్యఅతిథి ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం చాలా గొప్పదన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, సెమినార్ డైరెక్టర్ ఆచార్య వై.అశోక్ కుమార్, సెమినార్ కోశాధికారి డాక్టర్ కె.అబ్రహం లింకన్, అంబేడ్కర్ చైర్ పూర్వ విభాగాధిపతి ఆచార్య నాలాది శామ్యూల్, గాంధీ అధ్యయన కేంద్రం పూర్వ సంచాలకులు డాక్టర్ కె.సోమశేఖర్, ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూప రాణి, నూటా అధ్యక్షుడు డాక్టర్ బట్టు నాగరాజు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఆర్ఐవో జుబేర్

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షిక వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, విద్యాశక్తి ద్వారా ఐఐటీ మద్రాసు సౌజన్యంతో జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ జి.సునీత మాట్లాడుతూ ఏటా తమ కళాశాల విద్యార్థులు 90శాతంపైగా ఉత్తీర్ణత సాధిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు మెమెంటోలు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



ఉప్పలపాడులో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమ, పార్టీ నాయకులు

పెదకాకాని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి విజయమే లక్ష్యంగా పాటుపడాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడులో మండల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో ఉపాధ్యాయుల ఆశీస్సులతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించేలా శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర నేతృత్వంలో సమష్టిగా పాటుపడాలన్నారు. మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారనీ, మిర్చి ఎగుమతులు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. మిర్చి రైతుల సమస్యలపై శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సుదీర్ఘ సమావేశం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు జోక్యంతో 25 శాతం ఉన్న సీలింగ్‌ను ఎత్తివేసేందుకు, 75 శాతం మేర కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించిందని చెప్పారు. నాడు జగన్ చేసిన పాపాలు రాష్ట్రానికి శాపాలుగా మారాయని, పోలవరంలో జగన్ చేసిన తప్పిదాలను చంద్రబాబు నాయుడు సరిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, మన్నవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్లలో ప్రచారం

ఉపాధ్యాయులు గత వైసీపీ హయాంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారిపై యాప్‌ల భారం విపరీతంగా ఉందని, ఇక ఆ యాప్‌ల భారం తొలగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు వివరించారు. వెనిగండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు పట్టభద్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్కూల్ కిట్లు అందజేశామని, డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఇది కోరి తెచ్చుకున్న కూటమి ప్రభుత్వమని స్పష్టం చేశారు.

రీసైక్లింగ్‌పై విస్తృత పరిశోధనలు తప్పనిసరి



జాతీయ సదస్సు సావనీరును ఆవిష్కరిస్తున్న చైర్మన్ కృష్ణయ్య, వీసీ గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రీసైక్లింగ్‌పై విస్తృత పరిశోధనలు తప్పనిసరి కావాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పర్యావరణ శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం "సామాజిక, ఆర్థిక, పర్యావరణ అభివృద్ధికి అవలంబించాల్సిన సుస్థిర విధానాలు" అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ మానవ జీవన విధానంలో పర్యావరణ పరిరక్షణ అంతర్భాగం కావాలన్నారు. వస్తువుల పునర్ వినియోగం అనేది భారత జీవన విధానంగా ఉండేదనీ, తిరిగి దానిని మళ్లీ కొనసాగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విశ్వవిద్యాలయాల్లో రీసైక్లింగ్ అంశంపై విస్తృత స్థాయిలో పరిశోధనలు చేయాలని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయం తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ పురుగుమందుల వాడకాన్ని తగ్గించడంతోపాటు సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ పర్యావరణ విభాగం డీన్ డాక్టర్ కె.రాజేంద్రన్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు అనుసరిస్తున్న పద్ధతుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ఏఎన్యూ తాత్కాలిక రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, జాతీయ సదస్సు సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీరావు మాట్లాడారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 40 మంది పర్యావరణ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు సదస్సుకు హాజరై తమ పరిశోధన పత్రాలు సమర్పించారు. అనంతరం సదస్సు సావనీరును ఆవిష్కరించటంతో పాటు కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. సైన్స్ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, పర్యావరణ శాస్త్రం విభాగాధిపతి ఆచార్య ఏవీవీఎస్ స్వామి, పర్యావరణ విభాగ అధ్యాపకులు డాక్టర్ వి.సుభాషిని, డాక్టర్ కె.శశిధర్, భారతి దాసన్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ప్రొఫెసర్ వెంకటాచలం, మహారాష్ట్ర పెర్గో సన్ కళాశాల అధ్యాపకులు తన్వి యోగేష్ భరద్వాజ్, అమీర్ ముల్లా, ఆశిష్, మానవ వనరుల అభివృద్ధి విభాగ అధ్యాపకులు ఆచార్య తులసీదాస్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోస్టర్‌లో తప్పులు... నిరుద్యోగులకు తిప్పలు

(5వ పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన వర్టికల్ రిజర్వేషన్ ప్రకారం మొత్తం పోస్టుల్లో 1/3వంతు పోస్టులు మాత్రమే మహిళలకు వెళ్లాలి. కానీ కొన్ని కేటగిరీల్లో సగానికి సగం మహిళలకు వెళుతున్నాయని, కొన్ని కేటగిరీల్లో మహిళలకు రావాల్సిన 1/3వ వంతు కూడా రావడంలేదని అభ్యర్థులు అంటున్నారు. నోటిఫికేషన్లో మొత్తం 905 పోస్టులు ఉండగా అందులో 140 పోస్టుల వరకూ రోస్టర్ గందరగోళం ఉన్నట్లు చెబుతున్నారు. జనరల్ కోటాలో 408 పోస్టులుండగా మహిళలకు రమారమి 112 పోస్టులు రావాల్సి ఉండగా, వారికి అదనంగా 25 పోస్టులు కలిసి 137 పోస్టులు వచ్చాయని, అవి జనరల్ అభ్యర్థులు నష్టపోయారని, ఎస్సీ కేటగిరీలో మహిళలకు 25 పోస్టులు రావాల్సి ఉండగా వారికి 7 పోస్టులు తగ్గి 18 పోస్టులు, ఈ డబ్ల్యూఎస్ కోటాలో 20 పోస్టులు మహిళలకు రావాల్సి ఉండగా, వారికి 5 పోస్టులు తగ్గి 15 పోస్టులు మాత్రమ వచ్చాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని కేటగిరీల్లో రెండు పోస్టులే ఉన్నాయి. అలాంటి చోట్ల ఒకటి జనరల్, ఒకటి మహిళలకు కేటాయించారు. అలాంటి ప్రత్యేక సందర్భంలో జనరల్ అభ్యర్థులు భారీగా పోస్టులు కోల్పోయారు. ప్రభుత్వం ప్రకటించిన రోస్టర్ విధానంతో నిరుద్యోగుల తలరాతలు మారిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ నిర్వాకంతో ఐదేళ్లపాటు నోటిఫికేషన్లు లేక అల్లాడిపోయిన తమకు తాజా నోటిఫికేషన్ ప్రకారం రోస్టర్ అమలు జరిగితే ఇప్పుడే కాకుండా భవిష్యత్తులో కూడా అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం రోస్టర్ తప్పులను సరిచేసిన తరువాతే మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని వేడుకుంటున్నారు. కాగా ఈనెల 11వ తేదీన ఈ అంశంపై హైకోర్టులో తీర్పు వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకైనా మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

పాన్‌ఇండియా సైబర్ నేరగాళ్లు అరెస్టు

- రూ.1.9 లక్షలు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- ఎస్పీ తుషార్ డూడి వెల్లడి



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాన్‌ఇండియా సైబర్ నేరగాళ్లను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాలను ఎస్పీ తుషార్ డూడి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకర్లకు వివరించారు. వాట్సా‌ప్‌లో ముఖ్యమంత్రి ఫొటోను ప్రొఫైల్ పిక్చర్‌గా (డీపీ) ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్న వారి గుట్టు రట్టు చేసినట్లు చెప్పారు. నేపాల్‌కు చెందిన ఆచారి రంజిత్ సింగ్ ప్రస్తుతం నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డలో స్థిరపడ్డాడు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అల్లినగరం గ్రామానికి చెందిన ఆవుల మండ వెంకటనారాయణ, వెస్ట్‌ఢిల్లీ మహాత్మాగాంధీ క్యాంప్ పంజాబిబాగ్‌కు చెందిన జతిన్ వురఫ్ సాహిల్‌లు కలిసి గతేడాది డిసెంబరు నెలలో జిల్లాలోని చీరాల ఆనందపేటకు చెందిన వారికి ఫోన్ చేసి ఆరోగ్యప్రతినిధిగా నటించి ముఖ్యమంత్రి జననీ సురక్ష పథకం కింద రూ. 70 లక్షలు కేటాయించారని నమ్మించారు. మాయమాటలతో ప్రలోభపెట్టి ఫోన్ పే ద్వారా డబ్బులు బదిలీ చేయమని ఒప్పించారు. ఈ విధంగా ముగ్గురు బాధితుల నుంచి రూ. 1,64,724 బదిలీ చేయించుకున్నారు. దీనిపై చీరాల టుటౌన్ పోలీసు స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదైంది. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఐటీకోర్ ఎస్సై షేక్.నాయిబ్‌రసూల్ ఆధ్వర్యంలో టెక్నికల్ బృందం ఇచ్చిన సమాచారం మేరకు టుటౌన్ ఇన్‌స్పెక్టర్ బి.నాగభూషణం నేతృత్వంలో ఒక బృందం ఢిల్లీకి వెళ్లి, అక్కడ జతిన్‌ను పట్టుకొని ఫోన్ సీజ్ చేసి కేసుతో సంబంధం ఉన్న మిగిలిన అనుమానితుల వివరాలు సేకరించి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి లక్షా 90 వేల రూపాయల నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, 15 సిమ్ కార్డులు, నాలుగు బ్యాంక్ పాస్‌బుక్‌లు, రెండు ఏటీఎం కార్డులు సీజ్ చేశామని చెప్పారు. ఇప్పటి వరకు 96 సిమ్ కార్డులు ఉపయోగించి 132 మందిని మోసగించారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో రూ. 66 లక్షల వరకు మోసగించినట్లు వివరించారు. 20 రాష్ట్రాలలో, 4 కేంద్రపాలిత ప్రాంతాలలో వీరిపై మొత్తం 213 కేసులు నమోదైనట్లు తెలిసిందనీ, సుమారు రూ. 4 కోట్లు మోసం చేశారని తెలిపారు. వీరిని చాకచక్యంగా పట్టుకున్న చీరాల టుటౌన్ సీఐ బి.నాగభూషణం ఆర్ఐటీ శ్రీకాంత్, ఐటీ కోర్ టెక్నికల్ టీమ్ ఎస్సై షేక్.నాయబ్ రసూల్, ఎస్సై నాగశ్రీను, టెక్నికల్ టీమ్, కానిస్టేబుళ్లు బి.సురేష్, కె.రాము, ఐ.కీర్తి, డి.తబితలను ఎస్పీ అభినందించారు.చీరాల డీఎస్పీ మోయిన్, సీఐ బి.నాగభూషణం, ఆర్ఐ టి.శ్రీకాంత్, ఎస్సై షేక్.నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

జవాన్ వెంకటేశ్‌కు ఘన నివాళి



పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా, పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీలోని గౌడపాలెం గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ పరిశా మోహన వెంకటేశ్ అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. తొలుత వెంకటేశ్ గృహానికి బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, కెప్టెన్ సత్యప్రసాద్, ఏడీ డైరెక్టర్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి గుణశీల, పర్యవేక్షణాధికారి డి.ఆనందరావు, బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ హరికృష్ణ, చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ వేర్వేరుగా వెంకటేశ్ భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. భౌతిక కాయాన్ని స్వగ్రామం నుంచి శ్మశాన వాటిక వరకు అధికారిక లాంఛనాలతో తీసుకెళ్లారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్మీ సైనికులు మూడు రౌండ్‌లు గాలిలోకి కాల్పులు జరిపారు. గ్రామ సర్పంచి బొలగాని అరుణకుమారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బొలగాని వెంకటసులోచన, టీడీపీ నాయకులు వెంకటపతిరాజు పాల్గొన్నారు.

పట్టభద్రులను మోసగిస్తున్న పీడీఎఫ్

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ ముసుగులో వైసీపీకి తొత్తుగా మారి పట్టభద్రులను మోసగిస్తున్న కేఎస్ లక్ష్మణరావును విద్యావంతులు ఓడించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బాత్రూమ్‌లు, మద్యం దుకాణాల వద్ద కాపాలా పెట్టి ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ పాలకులు దెబ్బతీస్తుంటే అప్పుడు కేఎస్ లక్ష్మణరావు ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా కేఎస్ లక్ష్మణరావు శాసనమండలిలో ఏనాడైనా చర్చించారా అని ప్రశ్నించారు. విద్యావంతులు వీటిపై ఆలోచించాలని సూచించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తమైందనీ, కూటమి అధికారం చేపట్టిన తొమ్మిది నెలల్లోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ధన్యవాదాలు అన్నారు. అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ ఫలాలు సామాన్య ప్రజానీకానికి అందాలన్నా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శాసన మండలిలో ఆలపాటి అడుగు పెడితే విద్యావంతుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు.

మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ ఎంఎస్ చౌదరి

తాడేపల్లి (ప్రాతూరు కట్ట), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, స్పాన్సర్ విజయవాడ క్లబ్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విజయవాడ క్లబ్ అధ్యక్షుడు ఎంఎస్ చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి ఉపయోగపడతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అంకమ్మ చౌదరి, విజయవాడ క్లబ్ జాయింట్ సెక్రటరీ గుత్తికొండ వెంకట శైలేష్ కుమార్, క్లబ్ సభ్యులు, ప్రతినిధులు నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. తొలుత క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు నిర్వహించారు.

కుంభమేళాకు 60 వేల మంది యాత్రికులు

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు ప్రత్యేక రైళ్ల ద్వారా గుంటూరు, విజయవాడల నుంచి 60 వేల మంది యాత్రికులు ఇప్పటి వరకు ప్రయాణించారని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రైల్వేస్టేషన్ల మీదుగా ఇప్పటి వరకు 115 రైళ్లను రైల్వే శాఖ నడిపిందన్నారు. ఈ రైళ్లన్నీ 100 శాతం పైగా ఆక్యుపెన్సీతో ప్రయాణించాయని పేర్కొన్నారు. ఈ రైళ్లు ప్రయాగ్‌రాజ్ చియోకి, గయా, అజాంగడ్, బనారస్, దానాపూర్‌లకు ప్రయాణం చేశాయని చెప్పారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, నరసపూర్ రైల్వేస్టేషన్ల నుంచి ఈ రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం నడిపామన్నారు. ఆయా రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు సులభతరంగా రైళ్లలో బోర్డింగ్, డీబోర్డింగ్ అయ్యేందుకు రోప్ పార్టీలను ఏర్పాటు చేశామన్నారు. అదనపు షెల్టర్లు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ఈ నెల 23న చర్లపల్లి నుంచి దానాపూర్‌కు ఒక ప్రత్యేక రైలు, దానాపూర్ నుంచి చర్లపల్లికి మరో రైలు ప్రయాణికుల సౌకర్యార్థం నడపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సీపీఆర్వో విజ్ఞప్తి చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 534.60 అడుగులు ఉంది. ఇది 177.26 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8452 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 15,477, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్ఎల్‌సీ ద్వారా 280, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 33,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

నేడు నాలుగు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

వేమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి ఫీడర్‌లో శనివారం మరమ్మతులు చేపట్టే నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ గోపి తెలిపారు. బలిజేపల్లి, వరహాపురం, బేతాళపురం, బూతుమల్లి గ్రామాలలోని వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరించాలి

రేపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని రద్దు చేయటంతో విద్యార్థులు వేరొక చోటకు వెళ్ళి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉంటుందని పల్లవసేన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మోపిదేవి శివనాగరాజు అన్నారు. నిజాంపట్నంలోని సాంఘీక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల వద్ద పల్లవసేన ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తక్షణమే అధికారులు పునరాలోచించి పరీక్షా కేంద్రాన్ని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పల్లవసేన నాయకులు మోపిదేవి శ్రీను, కొక్కిలిగడ్డ నాగబాబు, బొమ్మడి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుపై దాడి కేసులో నిందితుడికి రిమాండ్

చెరుకుపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : మం డలంలోని గుళ్ళపల్లిలో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ని ఆటంకపరిచి విధి నిర్వహణలో ఉన్న హోంగార్డుపై దాడి చేసి కేసులో దినేష్‌ను గురువారం రాత్రి అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా అతనికి మార్చి 6వ తేదీ వరకు రిమాండు విధించినట్లు ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

డిప్యూటీ సీఎంపై పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కారుమూరి హనుమంతరావు కాలనీకి చెందిన జిట్టా రాజేంద్ర జనసేన నాయకులతో కలిసి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహాకుంభమేళాలో పుణ్యస్నానంపై అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టారంటూ వారు ఆరోపించారు. నాయిష్టం లియోట్విట్టర్ ప్రొఫైల్‌లో లింకు వచ్చినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిరుపేదలకు బియ్యం పంపిణీ

కర్లపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అబ్దుల్ కలాం ఫౌండేషన్, కర్లపాలెం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫౌండేషన్ ప్రెసిడెంట్, గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా తెలిపారు. కర్లపాలెంలోని బంగారురెడ్డిపాలేనికి చెందిన నిరుపేద కుటుంబానికి 10 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, చంద్రశేఖర్, షేక్ ఇబ్రహీం, షేక్ బహదూర్ బాషా, షేక్ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేశిరాజు వారి వీధిలో గణేశుల మంగమ్మ నడుచుకుంటూ వెళుతుండగా మా సొంత రోడ్డుపై ఎందుకు నడుస్తున్నావంటూ పుల్లంశెట్టి కిషోర్ అతని భార్య పద్మవతి, మరికొందరు కలిసి కొట్టినట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదేవిధంగా పుల్లంశెట్టి పద్మావతిని గణేశుల మంగమ్మ, సుజాత, లక్ష్మీ, గోవిందు మరికొందరు కలిసి గొడవపడి కిందపడేసి కొట్టినట్లు ఫిర్యాదు చేసిందని ఈ మేరకు పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం తెలిపారు.

ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట బ్యాంక్ ఉద్యోగుల నిరసన

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు బాపట్ల ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట శుక్రవారం అన్ని బ్యాంక్‌ల సిబ్బంది పాల్గొని నిరసన తెలిపారు. రిక్రూట్‌మెంట్ ఆల్ క్యాడర్స్, 5 రోజుల పనిదినాల వర్తింపు, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలి, ఎంప్లాయిస్ ఫిరిక్స్‌మీద ట్యాక్స్‌ను బ్యాంక్ భరించాలి. గ్రాడ్యుటి అమౌంట్‌ను పెంచి సెంట్రల్ ఉద్యోగులతో సరిసమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పి.యలమంద, ఎస్‌కే ముజుఫర్, ఐ.శ్రీనివాస్, పి.అనీల్, సీహెచ్ ఉమామహేష్, వి.బాబురావు, అన్నిబ్యాంక్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు మృతి బాధాకరం

రేపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : తోటివారికి సహాయపడాలనే సద్గుణంతో ఉండే గూడపాటి వెంకటేశ్వరరావు మృతి బాధాకరమని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. రేపల్లెలోని ఆయన స్వగృహంలో శుక్రవారం ఆనందబాబు పరామర్శించారు. వీరితో పాటు అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు తదితరులు శ్రీనివాసరావును పరామర్శించి వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఫణి రామలింగేశ్వరశర్మకు సన్మానం

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా చెరుకూరుకు చెందిన కంచభొట్ల ఫణి రామలింగేశ్వరశర్మను రైలుపేట సహృదయ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయన తెలుగు ఉపాధ్యాయుడిగా, పద్యకవిగా, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడిగా మాతృభాషకు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సభలో పి.శ్రీకాంత్, సీహెచ్ శ్రీరామశర్మ, జి.వెంకటేశ్వరరావు, సాయి, గణేష్, పద్మవల్లి పాల్గొన్నారు.



చెరువుజమ్ములపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



వేమూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

● లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉపాధ్యాయులను లోకసభ ప్యానల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ కోరారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

చెరువుజమ్ములపాలెంలో..

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ములపాలెం గ్రామంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికెళ్ళి పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేసి గెలిపించాలని కోరారు. కూటమితో ప్రజా సంక్షేమం సాధ్యమని, ప్రజల పక్షాన నిరంతరం పని చేసే కూటమి బలపరిచిన నాయకులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, పఠాన్ రాజేష్, శ్రీనివాసరావు, దొప్పలపూడి రామ్మోహనరావు పాల్గొన్నారు.

రాజా అందరి మనిషి : ఆనందబాబు

వేమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యావేత్తగా రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తిగా, కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అందరి మనిషి అని, ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండలంలోని పెరవలి, చావలి, వేమూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన పట్టభద్రులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుపరిపాలన, అభివృద్ధిని కాంక్షించి పని చేస్తున్నారని ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్మోహనరెడ్డికి బుద్ధి చెప్పినట్లుగానే పట్టభద్రులు ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించి ప్రత్యర్థికి గుణపాఠం చెప్పాలన్నారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు మాట్లాడుతూ, ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపిస్తే ఉపాధ్యాయులు ఇతర శాఖల ఉద్యోగుల అపరిష్కృతమైన సమస్యల పరిష్కారానికి ఆయన దోహదపడతారన్నారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దండే వెంకటసుబ్బారావు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఉసా రాజేష్, రాష్ట్ర మైనార్టీ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, దాది లక్ష్మణరావు, ఉక్కుర్తి నాగయ్య, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, నియోజకవర్గం తెలుగు రైతు ఉపాధ్యక్షుడు బండారు సూరిబాబు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు డి.సుధాకర్, వేల్పుల రవి, కె.రవికాంత్, జి.సుబ్బారావు, ఎం.పసి, కె.శివకృష్ణ, గంటా స్వాతి, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.



టీడీపీ మండల నాయకులతో మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి

నగరం మండలంలో...

నగరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను అత్యంత మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ పరిశీలకుడు జంగా కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని పలు ప్రాంతాలలో ఆలపాటి రాజాకు మద్దతుగా శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలపాటి రాజాను గెలిపిస్తే ఆయన అందరికి అందుబాటులో ఉండి నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేకా వెంకటశివరామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు చింతారావు, సర్పంచ్ శివరామబాబు, రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆలూరి బిక్షాలు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. మండల కేంద్రం భట్టిప్రోలులోని విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా సందర్శించి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కరపత్రాలు అందించారు. మండల గ్రామాల్లోని టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపులో భాగస్వాములు కావాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అన్నిరకాలుగా మేలు చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. రైతులు రిజిస్ట్రేషన్, యూరియా అమ్మకాలు, ఈపంట, ఈకేవైసీ, లోన్‌ల మంజూరుపై కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయశాఖాధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో మండలాల వారి వివరాలపై ఆరా తీశారు. పీఎం కిసాన్‌లో ఉన్న డేటా, వెబ్‌ల్యాండ్‌లో వచ్చిన డేటా ఖచ్చితంగా ఉందా లేదా సరిచూచుకొని వాటికి ఆమోదం తెలపాలని మండల తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారు. వీఆర్వో, తహసీల్దార్ లాగిన్‌ను తనిఖీ చేసి వాటిని వెంటనే ఆమోదించాలని మండల రెవెన్యూ అధికారులను వీక్షణా సమావేశం ద్వారా ఆయన ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరకు సృష్టించి అదనపు ధరలతో అక్రమ విక్రయాలు చేస్తున్న షాపు యజమానులపై అధికారులు తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈపంట రిజిస్ట్రేషన్ విషయంపై ఆరా తీశారు. తక్కువ రిజిస్ట్రేషన్ చేసిన సంబంధిత మండల అగ్రికల్చరల్ అధికారులతో వీక్షణా సమావేశం ద్వారా కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సీసీఆర్సి కార్డుల మంజూరులో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోబడుతాయని ఆయన ఆదేశించారు. రైతులకు లోన్‌లు మంజూరు విషయంలో బ్యాంకర్లకు భరోసా కల్పించాలని మండల వ్యవసాయాధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవలపై ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలి : కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సేవలలో నాణ్యత, ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రభుత్వ సేవలలో ప్రజాభిప్రాయంపై వివిధశాఖల జిల్లాఅధికారులతో శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలన్నిటిలో బాపట్ల జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఫించన్ పంపిణీ, అన్నక్యాంటీన్‌లు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలు, మహిళల సంరక్షణపై ప్రజాభిప్రాయ సేకరణ మొదలుకానుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సేవలు పొందగోరే వారు ఎవరైన తమ మొబైల్ ఫోన్ నుంచి ఫిర్యాదులు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వైద్యసేవలలో జిల్లా 13వ ర్యాంక్‌లో ఉండగా అన్నక్యాంటీన్ నిర్వహణలో 13వర్యాంక్, దీపం-2లో 3వ ర్యాంక్, చెత్తసంపద కేంద్రాల నిర్వాహణలో 15వర్యాంక్‌లో ఉందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పటేల్ నగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి పరిశీలించారు. పటేల్‌నగర్ మొదటిలైన్ వద్ద పారిశుధ్య కార్మికుల హాజరు పట్టిని తనిఖీ చేశారు. అదేవిధంగా నీటిసరఫరా విషయమై పటేల్ నగర్ ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుఫాన్ నగర్, కాపుకల్యాణమండపం రహదారి ప్రాంతాల వద్ద చెత్త లోడింగ్ పాయింట్‌లను పరిశీలించి బ్లాక్ స్పాట్స్ లేకుండా చూడాలన్నారు. అనంతరం నరాలశెట్టివారిపాలెం, కోర్టురోడ్డు పరిసర ప్రాంతాల పారిశుధ్యాన్ని పరిశీలించారు. నీటి సరఫరా విషయమై ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి మాణిక్యమ్మ నగర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అసిస్టెంట్ ఇంజనీర్‌తో మాట్లాడుతూ దిగువ ప్రాంతాలకు ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా తప్పక చేయాలన్నారు. అనంతరం సూర్యలంకరోడ్డులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీఐ రక్షణ కోసం కలిసి పని చేద్దాం

● ఫోరం ఫర్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం దోపిడిదారులు, బ్లాక్ మెయిల్ చేసే వారి కబంధ హస్తాల నుంచి రక్షించుకునేందుకు నిజాయితీగా పనిచేసే సంస్థలు, ప్రభుత్వ అధికారులు, మేధావులు, యువత ముందుకురావాలని ఫోరం ఫర్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్రమోహన్ పిలుపునిచ్చారు. చట్టాలతో కూడిన ఎఫ్‌ఆర్‌టీఐ క్యాలెండర్‌ను శుక్రవారం బాపట్ల ఎంపీడీవో బాబురావుకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సహచట్టం పనివిధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొందరు ఆర్టీఐ దరఖాస్తులు చేసి అవసరం లేని సమాచారం అడుగుతున్నారని, మరికొందరు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. తమ సంస్థ ఎఫ్‌ఆర్‌టిఐ పేద ప్రజల కోసం పనిచేస్తున్న, ప్రభుత్వ కార్యాలయాలలో పిఐఓలకు బ్లాక్‌మెయిల్ చేసేవారిని శిక్షించేలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌ఆర్మీవింగ్ రాష్ట్రఅధ్యక్షులు ఆవుల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు అమృత్‌రాజు, బాపట్ల పట్టణాధ్యక్షులు కాకి ఏబేలు, పట్టణ మహిళా అధ్యక్షులు కె.అమృత, రాము, బడుగు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి దుర్మరణం

మైలవరంరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆరేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడం గ్రామ శివారు ఇటుక బట్టీల వద్ద గురువారం అర్ధరాత్రి జరిగింది. భట్టిప్రోలు మండలం పెద్దపాలెం గ్రామానికి చెందిన ఎందుమూరి రవి రెండు నెలల క్రితం ఇటుక బట్టీల్లో పని చేసేందుకు కుటుంబంతో కలిసి వచ్చి పాకలు వేసుకొని నివసిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి టేబుల్ ఫ్యాన్ వైర్లు లీకై మంటలు రాగా రవి ఆరేళ్ల కుమారుడు యశ్వంత్ ఏదో జరుగుతుందని ఫ్యాన్ వద్దకు వెళ్లి వైర్లు తగిలి కిందపడ్డాడు. కుమారుడిని కాపాడే ప్రయత్నంలో తండ్రికీ గాయాలయ్యాయి. మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశు పోషకులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు



లేగ దూడల ప్రదర్శనలో రైతులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ పద్మావతి

వేమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తద్వారా పశుపోషకులకు అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ పద్మావతి అన్నారు. మండలంలోని పెరవలి గ్రామంలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ అజాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పద్మావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, పాడి పరిశ్రమ ద్వారా రైతులను ప్రోత్సహించేందుకు పలు పథకాల ద్వారా రుణ సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ కెవి జనార్ధనరావు మాట్లాడుతూ, పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాప్తి చెందే వ్యాధులు, వాటి నివారణ చర్యలు తదితర విషయాలను వివరించారు. మేలు జాతి లింగ నిర్ధారిత దూడలను ప్రదర్శనకు తీసుకు వచ్చిన 12 మంది రైతులకు, లేగ దూడలను ప్రదర్శనకు తీసుకు వచ్చిన 30 మంది రైతులకు పద్మావతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ డాక్టర్ చలపతి, డాక్టర్ యశ్వంత్, ఎం.శ్రీనివాసరావు, ప్రసాద్, శిరీష, సాయి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి

రేపల్లె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని బాలకోటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో కేజీపీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అరవపల్లి బాలకోటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతూ ఆలయం చుట్టూ పారిశుధ్యాన్ని మెరుగుపరిచి బ్లీచింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల కోసం గతంలో మాదిరిగానే తాగునీటి కోసం 15 చేతి పంపులను వేయాలని, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాదుబాబు, సెక్రటరీ బాషా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధనుకుమార్, ఆలయ అర్చకులు రమేష్‌బాబు, సిబ్బంది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి : ఏఎస్పీ

అమృతలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు అన్నారు. అమృతలూరులో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టులను నమ్మవద్దని, ఏ అధికారి వీడియో కాల్ చేయరని చెప్పారు. సెల్‌ఫోన్‌లు వినియోగించేవారు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఇల్లు అద్దెకు ఇస్తారా అంటూ మహిళలు వస్తారని, వారి పట్ల అప్రమత్తత అవసరం అన్నారు. వాహనదారులకు హెల్మెట్ తప్పని సరి అని చెప్పారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా అందరూ కలసి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అమర్‌వర్ధన్, స్థానిక సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ ఎం.వెంకటేశ్వరరావు

రేపల్లె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలను సమష్టి కృషితో విజయవంతం చేసే దిశగా ముందుకువెళ్ళాలని మాస్టర్ ట్రైనర్, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పీవో ఎస్‌ఏపీవోఎస్ సెక్టార్ ఆఫీసర్స్, మైక్రోఅబ్జరర్స్‌కి రెండో విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికలను నిర్వహించే సిబ్బంది ఎన్నికల సంఘానికి లోబడి విధులు నిర్వహించాలని సూచించారు. రూల్స్‌కు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే పీవోఎస్ సెక్టార్ ఆఫీసర్స్ మైక్రో ఆఫీసర్స్ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు స్టెప్ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. మండల పరిధిలోని విశ్వశాంతి విద్యా సంస్థ లో ప్రభుత్వ సంస్థ స్టెప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రేర ణ తరగతుల్లో డిప్యూటీ కలెక్టర్ సీఈవో చంద్రముని పాల్గొని పరీక్షలకు ముందు విద్యార్థుల ఆలోచన సరళి ఏ విధంగా ఉండాలి అనే అంశంపై వారికి వివరించారు. భవిష్యత్‌లో విద్యార్థులు వారి ప్రవర్తన, ఆలోచన విధానం ఎలా మలచుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారో అనే విషయంపై స్టెప్ అధికారులు వి.రాధిక, వెంకట్ పాల్గొని విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటరావు, హెచ్‌ఎం ఫణి పార్థసారధి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు పరచాలి



సమావేశంలో పాల్గొన్న కేంద్ర బృంద సభ్యులు

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను అధికారులు, సిబ్బంది సక్రమంగా అమలు పరచాలని కేంద్ర ప్రభుత్వ సభ్యులు సూచించారు. మండల పరిధిలోని పెద పులివర్రు గ్రామాన్ని శుక్రవారం బృంద సభ్యులు సందర్శించారు. స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని ప్రధానమంత్రి అవాస్ యోజన్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వెలుగు, పింఛన్లు, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాల అర్హులలో పారదర్శకత పాటించాలన్నారు. ఈ సమావేశంలో బృంద సభ్యులు విశాల్‌మల్‌కర్, సంధ్యారాణి, భానుచంద్ర, లోకేష్, ఎంపీడీవో రమణ, సర్పంచ్ ఉహారాణి, ఏపీఎం శ్రీమన్నారాయణ, పంచాయితీరాజ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ కార్డులపై అవగాహన

స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈ-శ్రమ కార్డులపై కార్మిక శాఖాధికారి జి.ప్రభాకర్ అవగాహన సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం ఈ పథకాన్ని తీసుకువచ్చాయని, భవన నిర్మాణ కార్మికులతో పాటు అసంఘటిత రంగంలో పని చేసే వారంతా ఈ పథకానికి అర్హులన్నారు.

పశు సంపద కాపాడుకోవాలి : ఎంపీడీవో

కర్లపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పశు సంపదను కాపాడుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం పశువైద్యశాలను శుక్రవారం ఆయన సందర్శించి పశు వైద్యాధికారిణి రేచల్ దివ్యకు కొన్ని సూచనలు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న గేదెలు, మేకలు, గొర్రెలకు ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ రెహంతున్నీసా, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే మనుగడ



తెలుగు తల్లి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ సాయిబాబు, తహసీల్దార్ సలీమా తదితరులు

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మానవుల అస్తిత్వం, మనుగడ మాతృభాషపై ఆధారపడి ఉంటాయని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. అంతర్జాతీయ మాతృ బాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఫోరం ఫర్ బెటర్, బాపట్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గల తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక వారసత్వం మాతభాషతోనే సిద్దిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల తహసీల్దార్ షేక్ సలీమా, గుడిపూడి సర్పంచ్ హనుమాన్‌జీ, ఆర్‌ఐ యలమంద, సీతామహాలక్ష్మి, గౌరి, సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృ భాష తల్లి లాంటిది : రావూరి

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మాతృ భాష తల్లిలాంటిదని మాతృ భాషకు విద్యార్థులు దూరమైతే కాలక్రమంలో మాతృ భాష అడుగంటిపోయే ప్రమాదం ఉందని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. ప్రపంచ మాతృ భాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, డాక్టర్ శ్రీనివాస్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక విద్య అంతా మాతృ భాషలో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సాహితి భారతి సభ్యులు డి.శామ్యూల్, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, ఎం.జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

మరువలేనిది మాతృ భాష : ఇనకొల్లు

కర్లపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మరువలేనిది, మధురమైనది మాతృ భాష అని కర్లపాలెం ప్రాథమిక వైద్యశాల ప్రధానోపాధ్యాయుడు ఇనకొల్లు పోలీసురావు అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోకి వచ్చిన తర్వాత తల్లి ఒడి నుంచి నేర్చుకున్నది మాతృ భాష అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ఇందుమతి, డీఎల్ ప్రసన్నలక్ష్మి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమూరు హైస్కూల్‌లో...

వేమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాతృ భాషోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, మన మాతృభాష అయిన తెలుగు భాషలో ఉన్న కమ్మదనాన్ని ఇతర అన్ని ప్రాంతీయ భాషల వారు కూడా గౌరవిస్తారని అన్నారు. సమావేశంలో తెలుగు ఉపాధ్యాయురాలు డి.శ్రీలక్ష్మి, హిందీ పండితులు విజయకుమారి, ఆంగ్ల ఉపాధ్యాయురాలు పద్మావతి తదితరులు ప్రసంగించారు. విద్యార్థులు తెలుగులో గీతాలు ఆలపించడంతో పాటు పద్యాలను చదివి వినిపించారు.

ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో...

రేపల్లె, ఫిబ్రవరి 21 : మాతృ భాష అభివృద్ధికి కృషి చేయాలని కవి, వాచస్పతి డాక్టర్ మొవ్వ వృషాద్రిపతి అన్నారు. స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం మొవ్వ వృషాద్రిపతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

రేపల్లె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : పేదరికంతో వైద్యం చేయించుకోలేని వారికి మంత్రి అనగాని సత్యప్రసాద్ అండగా నిలుస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా శుక్రవారం రూ.20 లక్షల నగదు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెరుకుపల్లి మండల పార్టీ అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ నాటికి... కడగండ్లు తీరేనా?

● మరమ్మతుల కోసం కృష్ణాడెల్టా కాల్వల ఎదురుచూపు
● ప్రత్యేక నిధుల మంజూరు చెయ్యాల్సిందే

ఏ కాల్వ కట్ట చూసినా కడ'గండ్ల'మయమే. కాల్వ అంచుల వెంటున్న గోడలు, షట్టర్‌లయితే సరేసరి. తుప్పుపట్టి రంధ్రాలు పడిపోయి, గోడలు పగుళ్లిచ్చి కూలిపోయిన దయనీయ పరిస్థితులే పశ్చిమ డెల్టాలో ఉన్నాయి. కట్టలకు గండ్లు పడకుండా ఉండాలన్నా, తూముల నుంచి నీరు లీకవకుండా షట్టర్‌ల స్థానంలో అడ్డు వెయ్యాలన్నా, అన్నిటికీ ఇసుక మూటలే దిక్కయ్యాయి. కొన్నిచోట్లయితే అవికూడా నిలవటానికి ఆధారం లేక కాల్వలోకి జారిపోయి నీటి ప్రవాహానికి అడ్డుపడిపోతున్న పరిస్థితి. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఎటు చూసినా ఇవే కష్టాలు. దీనికి కారణం... గత ప్రభుత్వ కాలంలో ఐదేళ్లు కాల్వల మరమ్మతులకు విదిలింపుల మినహా, ప్రత్యేకంగా నిధులిచ్చిన పరిస్థితిలేదు. ఇచ్చిన ఆ కొద్దిపాటి నిధులుకూడా సీజన్ దగ్గరకొచ్చాక కాల్వలకు నీరొదిలే ముందు విడుదల చేశామనిపించి తూటుకాడ వంటివి తొలగించామని వాటినీ ఆ పార్టీ నేతలే జేబులో వేసేసుకున్న పరిస్థితి. కొన్నిచోట్ల రైతులే స్వచ్ఛందంగా కాల్వలో దిగి తూటుకాడ, గుర్రపుడెక్క వంటివి తొలగించుకుంటేకానీ సాగుకు నీరందని దారుణ పరిస్థితినే నిన్నటి వరకు అనుభవించారు.

తెనాలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ డెల్టా మొత్తం మూడు జిల్లాల్లో విస్తరించి ఉంటే, వాటిలో బాపట్ల, గుంటూరు జిల్లాల్లోనే అధిక విస్తీర్ణం సాగవుతోంది. ఈ డెల్టాలో మొత్తం 5.71 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే, దానిలో గుంటూరు జిల్లా కింద 1,84,190 ఎకరాలు, బాపట్ల జిల్లా పరిధిలో 3,79,997 ఎకరాలు సాగవుతున్నాయి. మిగిలిన 7,164 ఎకరాలు మాత్రం ప్రకాశం జిల్లా పరిధిలో కొంతమేర ఉంది. గుంటూరు జిల్లాలో కొంత విస్తీర్ణానికి నీరు అందినా, బాపట్ల జిల్లాలోని చివరి భూములు, ప్రకాశం జిల్లాలో పూర్తి విస్తీర్ణానికి చుక్కనీరు అందటం గగనమైపోయింది. ఏ కాల్వ చూసినా కడ'గండ్ల'తప్ప పూర్తి సామర్థ్యంతో నీరు వెళ్లే పరిస్థితి లేదు. అయితే కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రావటంతో మరమ్మతులపై దృష్టిపెట్టలేని పరిస్థితి. అయితే ప్రభుత్వం వచ్చిన వెంటనే సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తిచేసింది. సంఘాలు వచ్చిన తర్వాతే ఏ కాల్వకింద అత్యవసర పనులు ఏమున్నాయనేది గుర్తించగలిగారు. అయితే ప్రస్తుతం పనులు గుర్తించటం ఎంత ముఖ్యమో! వాటికి అవసరమైన నిదులు మంజూరు చేయటం, పనులు సకాలంలో పూర్తిచేసేలా అనుమతులివ్వటం కూడా అంతే ముఖ్యం. గతంలోలాగా సీజన్‌కు ముందు చివరి నిమిషంలో కాకుండా ఏప్రిల్‌లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యేలా సత్వరం స్పందిస్తేనే 2025-26 ఖరీఫ్ సీజన్ సాగు నీటి కష్టాలు లేకుండా గట్టెక్కే పరిస్థితి.

నీరున్నా సాగు సాగలేదు...

పశ్చిమ డెల్టా పరిధిలో 5.71 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే, ఈ మొత్తం విస్తీర్ణంలో ఒక ఖరీఫ్ సీజన్‌లో సాగు పూర్తవ్వాలంటే కనీసం 70 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. అయితే గడచిన నాలుగేళ్లలో నీరు సమృద్ధిగా ఉన్నా, వరి సాగుకు మాత్రం అందలేదు. దీనికి కారణం... కాల్వలు పూడిపోయి, కట్టలు కోతపడిపోయి ఉండటమే. ప్రకాశం బ్యారేజి దగ్గర నుంచి మెయిన్ కెనాల్‌కు ప్రతి రోజూ 7,500 నుంచి 9వేల క్యూసెక్కులకు పైగా నీటిని వదిలినా చేలకు మాత్రం ఆ నీరు చేరని పరిస్థితి. కాల్వల మొదటి భూముల్లోనే ఆ నీరంతా నిండిపోయి ముంపు ఏర్పడిన పరిస్థితులూ ఉన్నాయి. ప్రధానంగా కొమ్మమూరు, బ్యాంక్ కెనాల్ కాల్వల కింద సాగు విస్తీర్ణం భారీగా ఉంది. ఒక్క కొమ్మమూరు కాల్వ కిందే 1.5 లక్షల ఎకరాలు సాగవుతుంటే, బ్యాంక్ కెనాల్ కింద లక్ష ఎకరాలకుపైగా సాగులో ఉంది. అయితే వీటిపై గత డెల్టా కాల్వల ఆధునీకరణ సమయంలోనూ పనులు జరగలేదు. దీంతో ఈ కాల్వలపై కష్టాలు మాత్రం ఏటా పెరుగుతూనే వస్తున్నాయి. కొమ్మమూరు కాల్వ కిందయితే కట్టలు గండ్లు పడటం, బాపట్ల, పొన్నూరు ప్రాంతాల్లో పొలాలు ముంపునకు గురవటం వంటి సమస్యలూ ఉన్నాయి. నీరులేక ఒక సమస్యయితే, నీరున్నా వీటి కింద కష్టాలు ప్రతికూలంగా ఎదురవుతుండటంతో ఏటా ఖరీఫ్ రైతు నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి.

గతంలో నిధుల మంజూరు విషయంలో ఒక తిరకాసు ఉండేది. ఓ.అండ్.ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) కింద వసూలయిన నీటి తీరువా మొత్తాలు మంజూరుచేస్తే కాల్వలపై కష్టాలు ఉండేవి కాదు. అయితే ఈ ఐదేళ్లలో ఏటా నీటిపారుదల శాఖ ఎంత ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం మాత్రం రూ. 15కోట్ల నుంచి రూ. 20 కోట్లలోపే మంజూరుచేసి చేతులు దులుపుకునేది. వీటిని చివరి నిముషంలో ఇవ్వటంతో సగం నిధులుకూడా ఖర్చుచేసే పరిస్థితి ఉండేది కాదు. ఆ మొత్తం నాయకులు జేబుల్లోకే చేరేవి. అయితే ఇప్పుడున్న కాల్వల పరిస్థితుల దృష్ట్యా ఈ సీజన్‌కు నీటిపారుదల శాఖ పంపిన రూ. 40 కోట్ల ప్రతిపాదనల మొత్తాన్నీ ఎటువంటి కోత విధించకుండా ఆమోదించితేనే కాల్వలపై ఏళ్లతరబడి ఉన్న కష్టాలు గట్టెక్కేది. అవసరమైతే వీటికి మించిన నిధులు కూడా మంజూరు చెయ్యాల్సిన పరిస్థితి ఉంది. సాగునీటి సంఘాలు ఈమధ్యే రావటంతో పూర్తిస్థాయిలో పనులను గుర్తించలేకపోయారు. అందువల్ల అదనపు నిధులు మంజూరు చేయగలిగితేనే పూర్తి శాతం కాల్వలకు వదిలిన నీరు చివరి భూముల వరకు చేరే అవకాశం ఉంది.


ప్రతిపాదనలు ఓకే.. సకాలంలో అనుమతులే కీలకం

గడచిన ఐదు ఖరీఫ్ సీజన్‌లలో పశ్చిమ డెల్టాలోని కాల్వలకు నీరు సమృద్ధిగా అందినా, పొలాలకు మాత్రం చేరలేదు. చివరి భూములకయితే పంట ఎండిన దారుణ పరిస్థితులుకూడా ఉన్నాయి. ఇంత దారుణంగా కాల్వలున్నా, నీరు చివరి భూములకు చేరకున్నా కనీసం మరమ్మతులు చేసిన దిక్కులేదు. గత ఐదేళ్లలో ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో పనులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెడితే, అవి ఆమోదం పొందటానికి, తర్వాత టెండర్‌లు పిలవటానికే పనుల కాలమంతా సరిపోయేది. తీరా పనులు మొదలుపెట్టే సమయానికి కాల్వలకు నీరు వదిలేయటంతో నీటిలోనే పనులు చేసినట్టు రాతరాసి ఆ నిధులను కాస్తా జేబుల్లో వేసేసుకునేవారు. అయితే ఈ సీజన్లో మాత్రం ఏకంగా 900కుపైగా పనులను గుర్తించారు. వీటి మరమ్మతులకు రూ. 40 నుంచి రూ. 50 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనలుకూడా ప్రభుత్వానికి పంపారు. ఇంత వరకు సకాలంలోనే ప్రతిపాదనల ప్రక్రియ పూర్తయింది. అయితే ఈ ఖరీఫ్ సీజన్ ముగిసినా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరి కోతలు పూర్తయిపోయి, రబీ కింద మొక్కజొన్న, జొన్నకూడా చాలావరకు చివరి దశకు వచ్చింది. అయితే ప్రకాశం జిల్లాకు ఇంకా మొదటి పంటకే నీరు ఇవ్వాల్సిన అవసరం ఉంది. మార్చి నెలాఖరుకు అటు రబీ, ఇటు రెండవ పంటకింద మొక్కజొన్న వంటివి కూడా పూర్తయిపోతాయి. మళ్లీ ఖరీఫ్ సీజన్ జూలై నుంచి మొదలవుతుంది. అంటే ఇంకా మూడు నుంచి నాలుగు నెలల వరకు పనులు చేసుకునేందుకు గడువు ఉంటుంది.

అయితే ఇప్పటికే నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది కనుక వెంటనే వాటి అనుమతులు మంజూరు చేస్తే టెండర్ల ప్రక్రియ వంటివి ఏప్రిల్లోపే పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. అప్పటి నుంచి జూలై వరకు పనులు చేసేందుకు అవకాశం ఉంటుంది కనుక కాంక్రీట్ పనుల వంటివాటినికూడా పక్కాగా పూర్తిచేసే అవకాశం ఉంటుంది. గతంలోలాగా తూటుకాడ తొలగించామని నిధులు జేబులో వేసుకునే పరిస్థితి ఉండదు. నీరు వదిలేలోపే పనులు పూర్తవుతాయి కనుక చెయ్యకుండానే చేశామని మాయచేసే అవకాశం కూడా ఉండదు. దీనికితోడు సాగునీటి సంఘాలు ఉండటంతో వాటి పర్యవేక్షణలో పనులు చేయటంవల్ల రైతులే స్వయంగా పనులు దగ్గరుండి చేయించుకోటానికి అవకాశం ఏర్పడుతుంది.


ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు నీరందించే ప్రధాన కాల్వ కూడా పూడికలతో నిండిపోయిన చిత్రం


పెదపూడి దగ్గర నిజాంపట్నం కాల్వకట్ట జారిపోయి కాల్వలో అడ్డుగా కనిపిస్తున్న చిత్రం


కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ నుంచి బ్రాంచి కాల్వలకు నీరు వదిలేందుకు ఏర్పాటుచేసిన షట్టర్‌కు అడ్డుగా రాళ్లు, చెత్త పేరుకుపోయిన చిత్రం


రేపల్లె దగ్గర ఇసుకపల్లి చానల్ కట్టలు జారిపోవటంతో వాటికి అడ్డుగా వేసిన ఇసుక మూటలు కూడా కాల్వలోకి జారిపోయి చెల్లాచెదురుగా నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న చిత్రం

సమన్వయంతో సాగండి

● పీవోలను మైక్రో అబ్జర్వర్లు సమన్వయం చేసుకోవాలి ● ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి


ఎన్నికల నిర్వహణపై జరిగిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, అబ్జర్వర్, డీఆర్వో

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను సమన్వయం చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మైక్రో అబ్జర్వర్లను ఆదేశించారు. శుక్రవారం గుంటూరు కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పరిశీలకురాలు వీ కరుణ, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఓటర్లలో మరింతగా నమ్మకం పెంచేందుకే ఎన్నికల సంఘం ప్రతి పోలింగ్ కేంద్రంలోను పరిశీలకుల తరుపున మైక్రో అబ్జర్వర్లను నియమించటం జరిగిందన్నారు. మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ అధికారులు పోలింగ్ డే ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ మెటీరియల్‌ను తీసుకోవటం, పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణ, తిరిగి మెటీరియల్ రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించే వరకు అన్ని ప్రక్రియల్లో పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ డేకి ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ అధికారులు తీసుకున్న మెటీరియల్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ప్రిసైడింగ్ అధికారులు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సహకారం అందించాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ కేంద్రాల నుంచి పూర్తి రక్షణతో రిసెప్షన్ కేంద్రాలకు తరలించి, కౌంటర్లలో అప్పగించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు పర్యవేక్షించాల్సిన అంశాలను పూర్తిస్థాయిలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. బ్యాలెట్ బాక్స్‌ను పోలింగ్‌కు సిద్ధం చేయడం, సీలు చేసే ప్రక్రియ పైన హ్యాండ్స్ ఆన్ శిక్షణను అందించారు.

గుడ్డుకాయ స్వాహా

పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చికెన్ మేళాకు పోటెత్తిన జనం


చికెన్ మేళాలో పట్టాభిపురంలోని స్వామి థియేటర్ గ్రౌండ్‌లో చికెన్ ఫ్రై తింటున్న ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్, భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ భయంతో రెండు వారాలుగా ముక్కకి.. ముద్దకి దూరంగా ఉన్న వారంతా కరువు తీరా కోడి పలావ్ ఆరగించారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళాకు జనం పోటెత్తారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహమ్మద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజలందరూ ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని పిలుపునిచ్చారు. ఉడికించిన వాటిని తినటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని చెప్పిందన్నారు. డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ నిమ్మల శేషయ్య, డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్ మాట్లాడుతూ ఉడికించిన చికెన్, గుడ్లు తినడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే అన్ని కథనాలను నమ్మాల్సిన పని లేదని చెప్పారు. మాంసం, గుడ్లు తినటం వల్ల పౌష్టికాహార లోపాలు ఉండవని చెప్పారు. లేనిపోని అపోహలు విడనాడాలని పిలుపునిచ్చారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఓ నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు లేవని చెప్పారు. ప్రజలు లేని పోని అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ప్రజల్లో ఉన్న అనుమానాలు తొలగించేందుకు ఈ ఫుడ్ మేళా ఏర్పాటు చేశామని చెప్పారు. భయం విడనాడాలని, సోషల్ మీడియా కూడా ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారం కారణంగా చికెన్, గుడ్లు వ్యాపారం దారుణంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, స్టాండింగ్ కమిటీ మెంబర్ బాబు, పౌల్ట్రీ ట్రేడర్ అసోసియేషన్ నేతలు ఎం. కిషోర్ బాబు, సురేష్, నాగేశ్వరరావు, రేణుక, గిరి, అసోసియేషన్ మెంబర్లు పాల్గొన్నారు.


చికెన్ బిర్యానీ, కోడిగుడ్లు తింటున్న యువకులు

బ్యాంకులను బతికించండి

● గుంటూరులో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్న విధానాలకు కేంద్రం వెంటనే స్వస్తి పలికి బ్యాంకులను బతికించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ డిమాండ్ చేసింది. బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గుంటూరులోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ యూనియన్స్ నేతలు మాట్లాడుతూ 5 రోజుల బ్యాంకింగ్ అమలు, పరిపూర్ణ సిబ్బంది నియామకం , శాంతియుత పని వాతావరణం , సంస్కృతి స్థాపన, అనాగరిక ప్రజల దాడుల నుండి బ్యాంకు ఉద్యోగుల రక్షణ , గ్రాట్యుటీ చట్ట సవరణ చేసి పరిమితిని రూ.25 లక్షలకు పెంపు, సిబ్బంది సంక్షేమ ప్రయోజనాలపై ఆదాయ పన్ను మినహాయింపు తదితర డిమాండ్లకు ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపాలని అన్నారు. బ్యాంకింగ్ పరిశ్రమలో అన్యాయ కార్మిక విధానాల ను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ గుంటూరు సర్కిల్ ప్రాంతీయ కార్యదర్శి కేఆర్ జయ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే కోటిరెడ్డి, యూనియన్ సలహాదారు కిషోర్ కుమార్, అధ్యక్షుడు రవి చంద్రారెడ్డి, కార్యదర్శి సయ్యద్ మొహమ్మద్ బాషా , రాష్ట్ర అధ్యక్షుడు ఎం సాంబశివరావు, ప్రాంతీయ కార్యదర్శి ఎం రాంబాబు, ఎ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరులోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు

రేపటి నుంచి అమరేశ్వరుని బ్రహ్మోత్సవాలు


అమరేశ్వరస్వామి మూలవిరాట్

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీన ప్రసిద్ధ శైవ ఆరామంగా భక్తులచే పూజలందుకుంటున్న అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారిని పెండ్లి కుమారునిగా చేయడం, 24న రాత్రి 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, వాస్తుహోమం, పర్యగ్నికరణం, అంకురారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు ఆలయ వేదపండితుల మంత్రోశ్చరణలతో మంగళవాయిద్యాల నడుమ నిర్వహించనున్నారు. 25న మండప పూజ, నిత్యోపాసన, బలిహరణ, పులి వాహనసేవ, పల్లకీ గ్రామోత్సవం జరగనుంది. 26న ఉదయం 8 గంటలకు రుద్రహోమంతో పాటు రోజువారి పూజలు జరుగుతాయి. రాత్రి 9 గంటలకు స్వామి వారి మూల విరాట్‌కు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత లింగోద్భవ అభిషేకం జరుగుతుంది. అర్ధరాత్రి 1 గంటకు స్వామివారి ఎదురు కోల సేవా మహోత్సవం, తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, 27 ఉదయం 9 గంటలకు చిలుక, నంది, మిద్దె రథ వాహనాలతో స్వామివార్ల గ్రామోత్సవం, సాయంత్రం 4 గంటలకు స్వామివార్ల దివ్యరథోత్సవం జరుగుతుంది. మార్చి 1న వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణతో ఉత్సవాలు ముగుస్తాయి. 4 వరకు స్వామివారికి ప్రత్యేక సేవలు ఉంటాయి.

ఉలిక్కి పడుతున్న మైనింగ్ దొంగలు!

● విచారణ ప్రారంభం కావడంతో అక్రమార్కులలో కలవరం
● వెలుగుచూస్తున్న అక్రమాలు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలో లభించే ఎర్ర గ్రావెల్ కోట్ల రూపాయల వర్షం కురిపించడంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితుల భూములను చెరబట్టి మరీ అక్రమార్కులు చేసిన అక్రమ మైనింగ్ బాగోతాలు నేడు బయట పడుతున్నాయి. వీరనాయకుని పాలెం గ్రామంలో 1983లో ప్రభుత్వం 60 ఎకరాల అసైన్డ్ భూమిని దళిత రైతులకు జీవనోపాధి కోసం డీకే పట్టాల రూపంలో అందజేసింది. అయితే 2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అసైన్డ్ పంట భూములు కనుమరుగై క్వారీ గుంతలుగా దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్ల కాలంలో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాల గుట్టు నేడు విచారణతో బయట పడుతుంది. దళితుల అసైన్డ్ భూములు నామరూపాలు లేకుండా పోయాయని విచారణకు వచ్చిన అధికారులే అవాక్కు అవుతున్నారు. గతంలో ఈ భూములలో సపోట, జామ వంటి పండ్ల తోటలతో పాటు ఆకు కూరలు, కూరగాయలు సాగు అవుతుండేవి, ప్రస్తుతం ఈ భూములలో ఎటు చూసిన క్వారీ గుంతలే దర్శనమిస్తున్నాయి. ఎర్ర గ్రావెల్ లక్షలాది క్యూబిక్ మీటర్‌ల మట్టిని తవ్వి తరలించుకుపోయినట్లు గనుల శాఖ అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలో పర్యావరణ, వాల్టా చట్టాలు అమలు చేయకుండా నిబంధనలు తుంగలో తొక్కి గ్రావెల్ తవ్వకాలు సాగించినట్లు గుర్తించారు.

● **దళిత రైతులకు బెదిరింపులు**

దళిత రైతులపై సాగించిన దౌర్జన్యకాండ నేడు వెలుగు చూస్తుంది. అసైన్డ్ భూములలో రాత్రికి రాత్రి పాగా వేసి మట్టి తరలించుకుపోయారు. గ్రావెల్ తవ్వకాలు విషయం తెలుసుకున్న పలువురు దళిత రైతులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయగా సర్వత్రా బెదిరింపులు, దౌర్జన్యాలే వారికి ఎదురయ్యాయి. ఒక అడుగు ముందుకు వేసిన మైనింగ్ మాఫియా దళిత రైతుల భూములలో వారి అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు సాగించడమే కాకుండా పోలీసులను పెట్టి అక్రమంగా నిర్బంధించిన సంఘటనలు ఉన్నాయి. పోలీసులు, రెవెన్యూయంత్రాంగం సైతం మైనింగ్ మాఫియాకే కొమ్ము కాయడంతో దళిత రైతులు ఆవేదన చెందారు. వైసీపీ పాలకులు దళిత రైతులను పిలిపించి బెదిరించడమే కాకుండా వారిని ఆ ప్రాంతాల నుంచి బలవంతంగా వెళ్లగొట్టారు. దళిత రైతులు అప్పటి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అవి బుట్టదాఖలు అయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి.

● **ధూళిపాళ్ల అలుపెరగని పోరాటం**

గ్రావెల్ మాఫియా ఆగడాలతో విసిగెత్తిన పలు గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో స్వయంగా ప్రస్తుత ఎమ్మెల్యే, అప్పటి ప్రతిపక్ష నాయకుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రంగంలోకి దిగారు. గ్రావెల్ మాఫియా ఆగడాలను బయట పెట్టేందుకు ధూళిపాళ్ల చేయని ప్రయత్నం లేదు. క్వారీల సందర్శనకు వెళ్లడానికి ప్రయత్నించిన ప్రతిసారి నరేంద్రకుమార్‌కు ప్రభుత్వం నుంచి ప్రతిఘటనే ఎదురయింది. అక్రమ నిర్బంధాలు, హౌస్ అరెస్టుల పేరుతో నరేంద్రకుమార్‌ను ఆప్రాంతానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకునేవారు. వీటిని సమర్థంగా ఎదుర్కొంటూనే నరేంద్ర కుమార్ క్వారీల వద్దకు చేరుకుని అక్రమ మైనింగ్ గుట్టును బయటపెట్టారు. మైనింగ్ జరిగిన ప్రాంతాలలో రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి టీడీపీ నేతలతో పాదయాత్ర జరిపి రాత్రి వేళ క్వారీ భూముల లోనే నిద్రించి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. డ్రోన్ విజువల్స్ సహాయంతో మైనింగ్ విధ్వంసాన్ని కేజీఎఫ్ పేరుతో విడుదల చేశారు.సుమారు 700 ఎకరాలలో రూ.2 వేల కోట్ల ఎర్ర గ్రావెల్ తవ్వకాలు సాగాయని టీడీపీ నిజనిర్ధారణ కమిటీ ప్రకటించింది. అంతేకాకుండా నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం నరేంద్రకుమార్ పోరుబాటకు సంఘీభావం తెలిపి అధికారంలోకి రాగానే కేజీఎఫ్ తరహాలో జరిగిన అక్రమ మైనింగ్‌పై సమగ్ర విచారణ జరుపుతామని ప్రకటించారు. నేడు సబ్‌కలెక్టర్ స్థాయి విచారణ ప్రారంభం కావడంతో అక్రమాల లోగుట్టు వీడుతుందని చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


మట్టి తవ్వకాలపై నిరసన తెలిపిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌ను క్వారీ నుంచి అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు (ఫైల్)



వీరనాయకునిపాలెంలో మట్టి తవ్వకాలను అడ్డుకున్న దళితులు (ఫైల్)



మరమ్మతులకు గురై చప్టాపై నిలిచిపోయిన గ్రానైట్ లారీ

చప్టాలో నిలిచిన గ్రానైట్ లారీ

రెండు రోజుల నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

బల్లికురవ, సంతమాగులూరు ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ - సంతమాగులూరు రోడ్డులో బండివారిపాలెం వద్ద గల నేల చప్టాలో గురువారం గ్రానైట్ స్లాబుల లారీ మరమ్మతులకు గురై నిలిచి పోయింది. శుక్రవారం సాయంత్రం వరకు కూడా ఈ లారీ అలానే ఉండటంతో ఈ మార్గంలో వెళ్లే భారీ వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. దీంతో సంతమాగులూరు నుంచి బల్లికురవ వెళ్లాల్సిన వాహనాలు మిన్నెకల్లు మీదుగా వెళ్తున్నాయి. పత్తేపురం నుండి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, గ్రామ ప్రజలు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు సైతం పక్కదారుల నుంచి ప్రయాణం సాగిస్తున్నాయి. వెంటనే లారీకి సంబంధించిన యజమానులు పక్కకు తీయించాలని ప్రజలు కోరుతున్నారు.



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కూటమి నాయకులు

వార్డుల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల పురపాలక సంఘం పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ కూటమి నాయకులు అన్నారు. శుక్రవారం కమీషనర్ అబ్దుల్ రషీద్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్య లోపంతో దోమలు బెడద అధికంగా ఉన్నట్లు వివరించారు. అలాగే వీధి కుక్కలు ప్రజలు వేధిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు కమీషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు గుఱ్ఱం శ్రీనివాసరావు, కొంర్తం రత్తంబాబు, తిరుపతి రాయుడు, శ్రీను, మస్తాన్‌రావు, కుమార్‌బాబు, మంగపతి, చంద్ర తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే దయా గుణం కలిగి ఉండాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు విద్యార్థి దశనుంచే ఇతరుల పట్ల దయా గుణం కలిగి ఉండాలని శ్రీకామాక్షికేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన కుమారుడు జ్యోనిస్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ విద్యాసాగర్, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజ్, మంజుల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ మేళాకు.. పోటెత్తిన జనం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ భయంతో రెండు వారాలుగా ముక్కకి.. ముద్దకి దూరంగా ఉన్న వారంతా కరువు తీరా కోడి పలావ్ ఆరగించారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళాకు జనం పోటెత్తారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజలందరూ ఉడికించిన చికెన్, గుడ్లను తిన్నారని విలువని చ్చారు. ఉడికించిన వాటిని తినటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని చెప్పిందన్నారు. డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ నిమ్మల శేషయ్య మాట్లాడుతూ ఉడికించిన చికెన్, గుడ్లు తినడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే అన్ని కథనాలను నమ్మాల్సిన పని లేదని చెప్పారు. మాంసం, గుడ్లు తినటం వల్ల పౌష్టికాహార లోపాలు ఉండవని చెప్పారు. లేని పోని అపోహలు వినవద్దని సూచించారు. ఇప్పటివరకు పశుసంవర్ధక శాఖ అధికారి ఓ. నర సింహారావు మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు లేవని చెప్పారు. ప్రజలు లేని పోని అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ప్రజల్లో ఉన్న అనుమానాలు తొలగించేందుకు ఈ ఫుడ్ మేళా ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే మీడియా దాలని, సోషల్ మీడియా కూడా ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారం కారణంగా చికెన్, గుడ్లు వ్యాపారం దారుణంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, బాష్యం విద్యా సంస్థల అధినేత రామకృష్ణ, స్టాండింగ్ కమిటీ మెంబర్ బాబు, పౌల్ట్రీ బ్రీడర్ అసోసియేషన్ సభ్యులు ఎం. కిషోర్ బాబు, సురేష్, నాగేశ్వరరావు, రేణుక, గిరి, అసోసియేషన్ మెంబర్లు పాల్గొన్నారు.

రోస్టర్‌లో తప్పులు...

నిరుద్యోగులకు తిప్పలు

(1వ పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన వర్టికల్ రిజర్వేషన్ ప్రకారం మొత్తం పోస్టుల్లో 1/3వంతు పోస్టులు మాత్రమే మహిళలకు వెళ్లాలి. కాని కొన్ని కేటగిరీల్లో సగానికి సగం మహిళలకు వెళుతున్నాయని, కొన్ని కేటగిరీల్లో మహిళలకు రావాల్సిన 1/3వ వంతు కూడా రావడంలేదని అభ్యర్థులు అంటున్నారు. నోటిఫికేషన్లో మొత్తం 905 పోస్టులు ఉండగా అందులో 140 పోస్టుల వరకూ రోస్టర్ గందరగోళం ఉన్నట్లు చెబుతున్నారు. జనరల్ కోటాలో 408 పోస్టులుండగా మహిళలకు రమారమి 112 పోస్టులు రావాల్సి ఉండగా, వారికి అదనంగా 25 పోస్టులు కలిసి 137 పోస్టులు వచ్చాయని, అవి జనరల్ అభ్యర్థులు నష్టపోయారని, ఎస్సీ కేటగిరీలో మహిళలకు 25 పోస్టులు రావాల్సి ఉండగా వారికి 7 పోస్టులు తగ్గి 18 పోస్టులు, ఈ డబ్ల్యూఎస్ కోటాలో 20 పోస్టులు మహిళలకు రావాల్సి ఉండగా, వారికి 5 పోస్టులు తగ్గి 15 పోస్టులు మాత్రమే వచ్చాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని కేటగిరీల్లో రెండు పోస్టులే ఉన్నాయి. అలాంటి చోట ఒకటి జనరల్, ఒకటి మహిళలకు కేటాయించారు. అలాంటి ప్రత్యేక సందర్భంలో జనరల్ అభ్యర్థులకు భారీగా పోస్టులు కోల్పోయారు. ప్రభుత్వం ప్రకటించిన రోస్టర్ విధానంతో నిరుద్యోగుల తలరాతలు తారుమారవుతున్నాయని వాపు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ సర్కారుకంటే ఐదేళ్లపాటు నోటిఫికేషన్లు లేక అల్లాడిపోయిన తమకు తాజా నోటిఫికేషన్ ప్రకారం రోస్టర్ అమలు జరిగితే ఇప్పుడే కాకుండా భవిష్యత్తులో కూడా అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం రోస్టర్ తప్పులను సరిచేసిన తరువాతే మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని వేడుకుంటున్నారు. కాగా ఈనెల 11వ తేదీన ఈ అంశంపై హైకోర్టులో తీర్పు వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకైనా మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

చీరాల్లో రేబిస్ కలకలం

- నాలుగు రోజుల క్రితం కుక్కకాటు
- అవగాహన లేమితో నిర్లక్ష్యం
- రెండు రోజుల నుంచి అనారోగ్యం
- హాస్పిటల్లో చేరిన బాధితురాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో శుక్రవారం రేబిస్ వ్యాధి కలకలం రేపింది. వేటపాలెం మండలం లక్ష్మీపురంకు చెందిన రేజువారీ కూలీ కామేశ్వరమ్మ రేబిస్ లక్షణాలతో చీరాల ఏరియా హాస్పిటల్లో చేరడంతో ఆరోగ్య సిబ్బంది ఆ లక్షణాలు గుర్తించి నివ్వెరపోయారు. వేటపాలెం మండల పరిధిలోని లక్ష్మీపురం, చీరాల మండల పరిధిలోని జాండ్రపేట పక్క పక్క గ్రామాలు. లక్ష్మీపురంకు చెందిన కామేశ్వరమ్మ కూలి పనుల నిమిత్తం జాండ్రపేట, లక్ష్మీపురంలలో పనులు చేస్తూ ఉంటుంది. ఈ క్రమంలో సుమారు నాలుగు రోజుల క్రితం జాండ్రపేట సమీపంలో ఓ వీధి కుక్క ఆమె చెవి సమీపంలో దాడిచేసి గాయపరిచింది. అయితే అవగాహన లేమితో బాధితురాలు చికిత్స చేయించలేదు. గురువారం రాత్రి నుంచి కామేశ్వరమ్మ ఆహారం తీసుకోలేక పోతోంది. మంచినీళ్లు కూడా తాగలేక ఇబ్బందులు పడుతోంది. అంతేకాకుండా నోటి నుంచి సొంగ కారుతుండటంతో కంగు తిన్న భర్త నారాయణరెడ్డి హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈక్రమంలో చికిత్స ప్రారంభించిన వైద్యులు రేబిస్ లక్షణాలను గుర్తించి నివ్వెరపోయారు. వెంటనే 108 సహాయంతో గుంటూరులోని ప్రత్యేక విభాగానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం ఆమెను కుక్క కరిచిన రోజే మరో ముగ్గురిని కరిచినట్లు వారు తెలిపారు.



ఐటీవల రామాపురం న్యూ కాలనీలో ఓ వ్యక్తిని కుక్కకరవడంతో కారుతున్న రక్తం



రేబిస్ లక్షణాలతో చికిత్స పొందుతున్న కామేశ్వరమ్మ

గ్రామంలో ప్రతి వీధిలో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ఈనెల 1వ తేదీ నుంచి ఇప్పటికి ఏడుగురిని కుక్కలు కరిచాయి. నాకు ఇటీవల కుక్క కరవగానే వ్యాక్సిన్ వేయించుకున్నాను. మరో రెండు సార్లు వ్యాక్సిన్ వేయించుకోవాల్సి ఉండగానే మరోమారు రెండో కాలును కూడా కుక్క కరిచింది. గ్రామంలో భయంగా ఉంటోంది. అధికారులు మా గోడు పట్టించుకోవాలి.

అమాంతం మీదకు వస్తున్నాయి



- వంగర వెంకటేశ్వర్లు, లక్ష్మీపురం

గతకొంత కాలంగా గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వాహనాలపై ప్రయాణించే సమయంలో అమాంతం మీదకు దూకుతున్నాయి. దీంతో రెండుసార్లు ద్విచక్ర వాహనం నుంచి కిందపడి గాయాల పాలయ్యాం. రాత్రివేళల్లో ప్రయాణాలు నరకప్రాయంగా ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

రోజులో రెండు సార్లు కుక్కలు కరిచాయి



- జంజనం ఆదిలక్ష్మి, లక్ష్మీపురం

బొబ్బేపల్లి గ్రావెల్‌కొండ అటవీశాఖదే

ఆశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి

మార్టూరు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని బొబ్బేపల్లి గ్రావెల్ కొండ అటవీశాఖకు చెందినదని, అటవీ శాఖ అనుమతులు లేకుండా ఎలాంటి అక్రమ కార్యకలాపాలు చేయకూడదని రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి స్పష్టంచేశారు. శుక్రవారం మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో కొండపై ఏకోపేఎమెకౌనమ్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి మొక్కలను నాటారు. ఈసందర్భంగా చిరంజీవిచౌదరి మాట్లాడుతూ బొబ్బేపల్లి గ్రావెల్ కొండ 357.5 ఎకరాలు 1894 లోనే మద్రాసు ఫారెస్ట్ యాక్టులో రిజర్వ్ ఫారెస్ట్ భూమిగా నమోదు అయిందన్నారు. ఇప్పటివరకు కొండపై అక్రమ మైనింగ్ జరిగిందని, ఇకనుంచి ఈ అటవీ భూమిని కాపాడుకోవడంలో గ్రామస్తులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కొండప్రాంతంలో మొక్కలను నాటాలని, వాటి పెంపకంపై కూడా సహకారం అందించాలని, అందుకు ప్రభుత్వం సహకారం ఉంటుందని అన్నారు. అటవీ భూమిలో గ్రామస్తుల వ్యక్తిగతం గా కాకుండా ఉమ్మడిగా ప్రయోజనాలను పొందాలన్నారు. గుంటూరు సర్కిల్ అటవీ అధికారి విజీవీ రాజు మాట్లాడుతూ అటవీ ప్రాంతం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. ఎంపీటీసీ దండా హరిబాబు మాట్లాడుతూ బొబ్బేపల్లి రాజుగారిపాలెం గ్రామస్తులలో ఇంటి నిర్మాణాలకు తదితర అవసరాలకు కొండనుంచి గ్రావెల్‌ను తరలించుకునే అవకాశంఇవ్వాలని, గ్రామంలో పంచాయతీ అవసరాలకు జరిగే లింకురోడ్డు నిర్మాణానికి గ్రావెల్‌ను తరలించుకునేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను కోరారు. డీఎఫ్‌వో భీమయ్య మాట్లాడుతూ కొండ ప్రాంతం పచ్చదనంతో పర్యావరణంతో కళకళలాడేవిధంగా నర్సరీలను పెంచుతామని పేర్కొన్నారు. ఆంధ్ర నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యుడు కనూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ అటవీ భూమి అభివృద్ధి, పర్యావరణం కోసం బొబ్బేపల్లి గ్రామస్తులక సహకారంగా నర్సరీ ఏర్పాటుకు లక్ష మొక్కలను తమ అసోసియేషన్ తరఫున అందజేస్తామన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి

అంతకు ముందు అధికారులు మొక్కలను నాటే కార్యక్రమం పూర్తయినతర్వాత సమీపంలోని కొండపై ఉన్న ఆంజనేయుడి గుడికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లూరి లావణ్య కోటేశ్వరరావు, పెంట్యాల శరత్, నాగేశ్వరరావు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

టమోటా సాగును పరిశీలించిన అధికారులు

మార్టూరు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్టూరు, ఇసుకదర్శి గ్రామాలలో టమోటా పంట సాగును శుక్రవారం మార్కెటింగ్ శాఖ డీడీ కే ఝాన్సీరాణి, ఏడీ రమేష్‌లు పరిశీలించారు. పంట సాగుకు పెట్టుబడి, దిగుబడి, ఖర్చులు, మార్కెట్‌లో ధర తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటుధర లభించడం లేదని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు కూడా చర్యలు తీసుకుంటామని డీడీ తెలిపారు.



టమోటా పంటను పరిశీలిస్తున్న మార్కెటింగ్ డీడీ ఝాన్సీరాణి, ఏడీ రమేష్ తదితరులు

చీడ పీడలను నుంచి పంటలను రక్షించేందుకే ఎన్‌పీఎస్ఎస్

పర్చూరు: పైర్లను చీడపీడల నుంచి పంటలను రక్షించుకునేందుకు ఎన్‌పీఎస్ఎస్ (జాతీయ చీడ పీడల పర్యవేక్షణ వ్యవస్థ) యాప్‌ను కేంద్ర ప్రభుత్వం భారత వ్యవసాయ శాఖ ప్రవేశ పెట్టిందని ఏడీఏ ఎన్‌మోహనరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నాగులపాలెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రైతులకు శనగ, వైట్‌బర్లీ పొగాకులో వచ్చే తెగుళ్లను ఏవిధంగా ఈ నూతన యాప్ ద్వారా గుర్తించవచ్చో తెలియజేశారు.

పర్చూరులో జటిలంగా ట్రాఫిక్

- వాహనదారుల అవస్థలు

పోలీసుస్టేషన్‌లో వేధిస్తున్న సిబ్బంది కొరత

పర్చూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత ప్రజల పాలిట శాపంగా మారింది. నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులో కనీసం ట్రాఫిక్‌పై దృష్టి సారించలేని దుస్థితిలో ఉండటమే ఇందుకు నిదర్శనం. సర్కిల్ కార్యాలయం ఉన్నా ట్రాఫిక్ సమస్య తీరని సమస్యగా నెలకొంది. వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారిలో పర్చూరు ఉండటం, ఇంకొల్లు, చీరాల తదితర ప్రాంతాల నుంచి గుంటూరు, విజయవాడ, రాజధాని ప్రాంతానికి రాకపోకలు సాగించే వారితో నిత్యం రద్దీగా ఉంటోంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల మధ్య చాలా సందర్భాల్లో వాహనాలు ముందుకు కదలని పరిస్థితి. ముఖ్యంగా ప ర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో సాయంత్రం 7 నుంచి 8 గంటల మధ్య ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. మంత్రి వాహనం అయినా, 108 వాహనం అయినా ఈసమయంలో నిలిచి పోవాల్సిందే అన్న విధం గా పరిస్థితి ఉంది. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా స్థలాలను ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహించుకోవటం ఒక సమస్య అయితే ట్రాఫిక్‌పై పోలీసులు దృష్టి సారించలేక పోవటం మరో సమస్యగా మారింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత...

పర్చూరు పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత ఇబ్బందికరంగా మారింది. నిబంధనల ప్రకారం 18 మంది పోలీసు కానిస్టేబుళ్లు (పీసీ)లు ఉండాల్సి ఉండగా 11మంది మాత్రమే ఉన్నారు. వీరిలో నలుగురు మహిళా కానిస్టేబుళ్ళు కావటం గమనార్హం. ఉండటానికి ఉన్న సిబ్బందిని కోర్టు, స్టేషన్ పనులకు కేటాయిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌పై దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది.



పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో ట్రాఫిక్ స్తంభించడంతో నిలిచిపోయిన వాహనాలు

వేలంలో పెరిగిన తిరునాళ్ల షాపుల ఆదాయం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శింగరకొండ తిరునాళ్లలో షాపులు పెట్టి వ్యాపారం చేసుకునే హక్కు పొందేందుకు శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో చీరాల డీఎల్‌పీవో వి. శివన్నారాయణ, ఎంపీడీవో బత్తిని సింగయ్య, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, సర్పంచ్ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు చెన్నయ్య, మస్తాన్‌వలి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది పాల్గొన్నారు. పంచాయతీ మద్దతు ధర రూ. 4,50,000 నుంచి ప్రారంభం అయ్యింది. శింగరకొండపాలెంకు చెందిన ఒబ్బని నాగరాజు 14,55,000 హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 14 లక్షలు కాగా ఈ ఏడాది అదనంగా 55,000 ఆదాయం పంచాయతీకి వచ్చిందని అధికారులు తెలిపారు.

మాజీ ఎంపీపీకి మంత్రి గొట్టిపాటి పరామర్శ

బల్లికురవ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పోగుల సుబ్బారావు అనారోగ్యం బారిన పడటంతో శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆయనను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వారి కుమారుడు శేఖర్‌ను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగుబాబు వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. వారికి ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వంగులూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వంగులూరు సబ్ స్టేషన్ పరిధిలో శనివారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ విస్తరణ పనులలో భాగంగా 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12.30 నిముషాల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

లారీ బ్యాటరీలు చోరీ

బల్లికురవ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ గ్రామంలో గురువారం రాత్రి నిలిపి ఉన్న గ్రానైట్ ముడి రాయి రవాణా చేసే లారీ బ్యాటరీలను గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. బల్లికురవ వైపు నుంచి క్వారీలకు వెళ్లే రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో లారీని నిలుపుదల చేసి డ్రైవర్ నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో దొంగలు రెండు బ్యాటరీలను తస్కరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం లారీని స్టార్ట్ చేసేందుకు డ్రైవర్ చూడగా బ్యాటరీలు లేవు. దీంతో లారీ యజమాని బ్యాటరీల చోరీ విషయం తెలిపారు. లారీల యజమానులకు తెలిపారు. ఇప్పటి గత కొంతకాలంగా రాత్రుళ్లు కొందరు గుర్తు తెలియని దొంగలు నిలిపి ఉన్న లారీల బ్యాటరీలను డీజిల్‌ను దొంగిలిస్తున్నారు. అధికారులు నిఘా ఉంచి దోపిడీలను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.

సైన్స్ ప్రయోగాలతో ఉన్నత ఆలోచనలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైన్స్ ప్రయోగాల పోటీల్లో పాల్గొనడం వలన ఉన్నతమైన ఆలోచనలు పెరుగుతాయని కేజీఎం బాలికోన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థినులకు సైన్స్ ప్రయోగాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో కూడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని వారికి సూచించారు.



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి కీర్తిసరోజ్

దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం చేయూత

చినగంజాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ బాలబాలికలకు కావలసిన ప్రత్యేక అవసరాలకు సంబంధించి ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనందిస్తుందని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కే.కీర్తిసరోజ్ అన్నారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కడవకుదురు గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల, రెండు ప్రాథమిక పాఠశాలలు, ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను చీరాల లోక్ అదాలత్ కమిటీ మెంబరు ఆదేశాల మేరకు శుక్రవారం ఆమె సందర్శించి, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు, విద్య పరంగా వచ్చే సమస్యలు, బాలిక హక్కుల గురించి మండల పారా లీగల్ అడ్వకేట్ ఎ.రామకృష్ణారెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోషకాహార విలువలు గురించి వివరించారు. కార్యక్రమంలో పారాలీగల్ మండల వలంటీర్ ఎ.వి.రమణారావు, ఆయా పాఠశాలల హెచ్.ఎంలు, ఉపాధ్యాయులు, హెచ్‌వీ య.వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీలు రమ్య, షైలీ, ఏఎన్ఎంలు ఎం.శారద, శిరీష, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో బ్యాంక్‌లో రుణం కోసం యత్నం

- గుర్తించి పోలీసులకు అప్పగించిన బ్యాంక్ అధికారులు
- ఇప్పటికే ఇంకో బ్యాంక్‌లో గోల్డ్ కోటింగ్ బంగారంతో రుణం

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారంతో బ్యాంక్‌లో రుణం తీసుకునేందుకు వెళ్లిన వ్యక్తిని గుర్తించి పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణానికి చెందిన ఒక వ్యక్తి శు క్రవారం సాయం త్రం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న బ్యాంక్ కు సుమారు 24 గ్రాముల బరువు ఉన్న రెండు గాజులను తీసుకు వెళ్ళాడు. బ్యాంక్ అధికారులు నకిలీ బంగారం గా గుర్తించి పోలీస్ లకు అప్పగించారు. ఇదే వ్యక్తి వారం రోజుల క్రితం సుమారు 30 గ్రాముల బరువు ఉన్న కడియం ను అద్దంకి పట్టణం లోని ఆదే బ్యాంక్ కు చెందిన మరో శాఖ లో తాకట్టు పెట్టి లక్ష రూపాయల రుణం తీసుకున్నట్లు ఆ బ్యాంక్ అధికారులు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఆ బ్యాంక్ అధికారులు తమ వద్ద తాకట్టు పెట్టిన కడియం ను పరిశీలించగా గోల్డ్ కోటింగ్ తో ఉన్నట్లు గుర్తించారు. ఆదే శ్రీకాంత్ రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి కుమారుడు కావటం గమనార్హం. ఈ విషయమై సీఐ సుబ్బరాజు ను వివరణ కోరగా ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, బ్యాంక్ అధికారులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్

ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరించిన మంత్రి

బల్లికురవ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే డైరీని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. బాపట్ల జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు ఆధ్వర్యంలో యూనియన్ నేతలు మంత్రిని బల్లికురవ మండలం వైదనలో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కృష్ణారెడ్డి, కొండలరావు, దుర్గాప్రసాద్, మురళి, శ్రీనివాసరావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



రేణుకమ్మ వారి ప్రతిష్ఠ సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

వైభవంగా రేణుకమ్మ దేవర ప్రతిష్ఠ

శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు

వంగులూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వంగులూరులో నూతనంగా నిర్మించిన రాయిణి వారి వంశ దేవర రేణుకమ్మ వారి ప్రతిష్ఠా మహోత్సవం పూజా కార్యక్రమాలు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు శ్రీ మేడూరి ఫణీంద్ర శర్మ వారి రుత్విక్ బృందం నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలలో రాయిణి వంశస్తులైన పలువురు దంపతులు పాల్గొన్నారు.



జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు కంప్యూటర్‌ను బహూకరిస్తున్న దాత నారాయణ

కోలలపూడి హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ

మార్టూరు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌కు కొండన్న ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, రైటర్ ఈవీ నారాయణ రూ. 30 వేల విలువచేసే కంప్యూటర్‌ను బహూకరించారు. శుక్రవారం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులకు బాలకృష్ణకు కంప్యూటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, టి. నాగేశ్వరరావు, కందిమళ్ల అంజిబాబు, రంగబాబు, కృష్ణంగారావు, వీరరాఘవులు, సుదాకర్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ



రామకూరు గ్రామంలో పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న డీఎల్‌పీవో శివనారాయణ

చెత్త సంపద కేంద్రాలుగా డంపింగ్ యార్డులు

పంగులూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మించిన డంపింగ్ యార్డులను చెత్త సంప ద కేంద్రాలుగా వినియోగించుకోవాలని డీఎల్‌పీవో శివనారాయణ సూచించారు. మండలంలోని రామకూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డంపింగ్‌యార్డు వినియోగాన్ని పరిశీలించారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, స్థానిక సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామంలోని వీధులలో, నివాస ఆవాసాల నుంచి సేకరించిన చెత్తను వర్మీ కంపోస్ట్ ఎరువుగా తయారు చేయడం ద్వారా సంపద సమకూర్చుకోవాలన్నారు. స్వమిత్వ సర్వే నిర్వహణ, ఇంటి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి ఈవోఆర్‌డీ సునీత, కార్యదర్శులు శిరీష, జానీ బేగం, శ్రీనివాసరావు, కళ్యాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రుణాల చెక్కులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్, గ్రామసర్పంచ్

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్‌లు అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చినగంజాం శాఖ కార్యాలయంలో వెలుగు ఆధ్వర్యంలో ఐదుగురు డ్వాక్రా మహిళలకు శుక్రవారం జరిగిన రుణాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని చెక్కులు అందజేశారు. లఘుపతి దీదీ పథకం కింద ఐదుగురు మహిళా సభ్యులను ఎంపిక చేసి రూ.8లక్షల రుణాలను పంపిణీ చేసినట్లు ఏపీఎం గడ్డె పెద్దసుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీలక్ష్మీ, వీవోఏ శివ, గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు టీ.జయరావు, నరహరి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పార్థసారధి పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పర్చూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పర్చూరులో ఈనెల 23న నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీ అధ్యక్షుడు తోకట కృష్ణమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. భవనం వీరారెడ్డి భవనంలో జరిగే శిబిరంలో గుండె, ఎముకలు, ఊపిరితిత్తులు, చర్మ, గొంతు, ముక్కు, చెవి, దంత, కంటి, పిల్లలకు , స్త్రీలకు సంబంధించిన అన్నీ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పర్చూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పర్చూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు అయ్యింది. యద్దనపూడి మండలానికి చెందిన మహిళపై మార్టూరుకు చెందిన వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించటంతోపాటు, కులంపేరుతో దూషించినట్లు బాధిత మహిళ ఫిర్యాదుపై పోలీసులు కేసునమోదు చేసినట్లు సమాచారం.

ట్రాఫిక్‌పై పోలీసుల ప్రత్యేక దృష్టి

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

అద్దంకిలో మార్పు ఆరంభం



అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో విజువల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి రోజు సాయంత్రం సిబ్బంది రోడ్డుపై విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టడంతో మార్పు కనిపిస్తోంది. సాధారణంగా సీఐ స్థాయి అధికారి సర్కిల్ కార్యాలయంలో కుర్చీని ఉండటమో లేక రోడ్డుపై కి వచ్చిన తనిఖీలకు పరిమితం కావటమో చేస్తుంటారు. కానీ అద్దంకి టౌన్ సీఐ గా విధులు నిర్వహిస్తున్న సుబ్బరాజు మాత్రం అందుకు భిన్నంగా అనునిత్యం పర్యవేక్షణ చేయటం తో పాటు ఏ చిన్న సంఘటన చోటు చేసుకున్నా ముందు తాను ఉంటుండటంతో సిబ్బంది కూడా పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అద్దంకి పట్టణంలో ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణలో కొంతమేర మార్పు కనిపిస్తోంది.

గతంలో అద్దంకిలో మూడు సంవత్సరాల పాటు ఎస్సై గా పనిచేసిన అనుభవానికి తోడు మార్పు తీసుకురావాలన్నా చిత్తశుద్ధితో సీఐ గా బాధ్యతలు చేపట్టిన నెల రోజులలో అద్దంకి పట్టణంలో తనదైన రీతి లో మార్పునకు ఆరాధ్యుల సుబ్బరాజు శ్రీకారం చుట్టారు. జనవరి 16 వ తేదీ అద్దంకి టౌన్ సీఐ గా బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాజు ప్రధానంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నివారణ పై దృష్టి సారించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణం చేయకుండా ఉండే విధంగా, ట్రాలీ ఆటోలలో కూలీలను తరలించకుండా చేసేందుకు ప్రతి రోజు తనిఖీలు చేయించారు. ఆయా ప్రాంతాలలో తనిఖీలు చేసి కూలీలకు కౌన్సెలింగ్ చేశారు. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలో ప్రధాన కూడలి ప్రాంతాలుగా ఉన్న భవానిసెంటర్, ఆర్టీసీ బస్టాండ్, బంగ్లా రోడ్డు, రామ్‌నగర్‌ల వద్ద ఉదయం, సాయంత్రం రద్దీ సమయాలలో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను పనిచేసేలా మరమ్మతులు చేయించారు. నామ్ రోడ్డు వెంబడి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు వివరించటం, ట్రాఫిక్ నియంత్రించేందుకు, పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలను గమనిస్తూ వాహన చోదకులకు తగు సూచనలు చేసేందుకు మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చర్యలు చేపట్టారు. ఇక అద్దంకి పట్టణంలో ట్రాఫిక్‌కు ప్రధాన అడ్డంకిగా ఉన్న తోపుడు బండ్ల వ్యాపారులకు ముందస్తుగానే తగు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితులలో సైడ్ డ్రైన్‌లు దాటి రోడ్డుపై తోపుడు బండ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేయరాదని హెచ్చరించారు. దీంతో రోడ్డు ఒకింత విశాలంగా మారింది. గతంలో అద్దంకి పట్టణంలో తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలు కొంత తగ్గుముఖం పట్టాయి. మార్పు గమనించిన పలువురు ప్రజలు శెభాష్ పోలీస్ అంటున్నారు.



ఆటోలలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

పారదర్శకంగా రీ సర్వే

● కలెక్టర్ వెంకటమురళి



మోటుపల్లిలో రీ సర్వే భూముల పటాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

చినగంజాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములు ఉన్న రైతులందరికి నోటీసులు అందజేసి, రైతులకు హద్దులు చూపించి తప్పులు లేకుండా రీ సర్వే చేయాలని అన్నారు. రైతుల సమక్షంలోనే రీ సర్వే నిర్వహించాలని సూచించారు.

అనంతరం ఆయన మోటుపల్లిలోని పురాతన వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించి, ఆలయంలోని శాసనాలను పరిశీలించారు. చినగంజాం పరిధిలోని ఉప్పు కొఠారులను పరిశీలించి, ఉప్పు రైతులు, కూలీలతో మాట్లాడారు. ఉప్పుకొఠారుల భూములు ఎంత విస్తర్ణంలో ఉన్నాయని తహసీల్దార్ జె.ప్రభాకరరావుని అడగగా మండల పరిధిలోని 2,400 ఎకరాల ఉప్పు భూములుగా ఉండగా, దానిలో 1,600 ఎకరాలు మాత్రమే రైతులు సాగు చేస్తున్నట్లు తెలిపారు. మీకు కూలీ ఎంత వస్తుంది, డ్వాక్రా గ్రూపులో ఉన్నారా అని ఉప్పు కూలీలు బేతాళ ఉల్దారాణి, పలతోటి ఝాన్సీలని ఆయన అడిగారు. నేను ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు కట్టుకున్నానని దానికి ప్రభుత్వం వారు ఇచ్చి రూ.1.80 లక్షల పోగా, మూడులక్షల రూపాయిలు అప్పు అయిందని, ఉపాధిహామీ ద్వారా రావాలసిన బిల్లులు ఇంత వరకు రాలేదని ఉల్దారాణి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రూ.75 పైసల వడ్డీకి నీకు రుణం ఇప్పిస్తానని కలెక్టర్ ఆమెకు హామీ ఇచ్చారు.

తదనంతరం ఆయన సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలోని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కవులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం రోటరీ కార్యాలయంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు కవులు, రోటరీ క్లబ్ సభ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, గాడేపల్లి దివాకర్‌దత్తు, శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, కె. అనిలకుమారలను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, సీహెచ్ మురళిసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, హరిప్రసాద్, పూర్ణచంద్రరావు, ఆంజనేయులు, శ్రీలక్ష్మీశివకుమారి, భువనేశ్వరి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సృజన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం సృజన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో కమతేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు పద్య శాసనం, ఎర్రా ప్రగడ విగ్రహాలను పూల మాలలతో అలంకరించారు. తెలుగు భాషాపై మమకారాన్ని కార్యక్రమంలో వక్తలు తెలియజేశారు.

తెలుగుభాషను చులకన చేయవద్దు

తల్లిలాంటి తెలుగుభాషను చులకన చేయవద్దని, మాతృభాషలో రాణిస్తేనే ఇతర అన్ని సబ్జెక్టులలో రాణిస్తారని హెచ్ఎం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు ఉపాధ్యాయులు వంగె వరపు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాషోత్సవం- తెలుగు కార్యక్రమాన్ని పాఠశాల హెచ్ఎం ప్రారంభించారు. విద్యార్థులకు భాషాభివృద్ధిలో భాగంగా తెలుగు పద్యాల పోటీ, వక్తృత్వం, పఠనం, కథలు, వ్యాసరచన, గుడ్ హ్యాండ్ రైటింగ్ వంటి పలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి. వెంకటరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, పద్మావతి, పీడీ లావణ్య పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు పరిశీలన

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): శింగరకొండ వార్షిక తిరునాళ్ల కోసం అవసరమైన అదనపు విద్యుత్ లైన్‌ల ఏర్పాటు, పాత విద్యుత్ లైన్‌ల మార్పు, కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు ఆశాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఈవో తిమ్మానాయుడులు శుక్రవారం పరిశీలించారు. శింగరకొండలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద నుంచి కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు మెట్ల మార్గం వెంబడి ఎల్‌టీ లైన్ మార్పు, ఆర్యవైశ్య సత్రం నుంచి నర్సరావుపేట రోడ్డులోని ఆర్చి వరకు విద్యుత్‌లైన్ మార్పు, టీటీడీ కళ్యాణ మండపం వరకు ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటు, మూడు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం పరిశీలించారు. పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. అద్దంకి పట్టణంలో పలు చోట్ల నామ్ రోడ్డును క్రాస్ చేస్తూ ఉన్న విద్యుత్ లైన్‌ల మార్పు కోసం కూడా ఆయా ప్రాంతాలలో ఈఈ మస్తాన్‌రావు పరిశీలించారు. డీఈఈ దామోదరం, టౌన్ ఏఈ శ్రీనివాసరావు, టెక్నికల్ ఏఈ బాలకోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



శింగరకొండ వద్ద విద్యుత్ లైన్‌ల మార్పు కోసం పరిశీలిస్తున్న ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఈవో తిమ్మానాయుడు

ప్రతిభావంతులకు ప్రోత్సాహక నగదు బహుమతులు

ఇంకొల్లు,ఫిబ్రవరి 21,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో 2023-24వ సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రథమ,ద్వితీయ స్థానాలు పొందిన బి.కుసుమ, ఎస్‌కె రషీదాలకు బొర్రా ఈశ్వరమ్మ మెమోరియల్ తరుపున ప్రతిభా అవార్డుల కింద రూ.6000,రూ.4000 శుక్రవారం అందజేశారు. 2024-25వ సంవత్సరంలో ప్రతి తరగతిలో ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు దివంగత ఆరె నరసింహారావు,నాగలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం కావూరి నాగార్జున, భవానీ దంపతులు రూ.5000 బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వవిద్యార్థిని కావూరి సాయిసుప్రియ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు రూ.40వేలు డిపాజిట్ చేసి ప్రతి ఏడాది పేదవిద్యార్థులకు రూ.10వేలు అందజేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయిని రావి నాగేశ్వరి అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడూరి సత్యనారాయణ,నార్నె వేణుగోపాల్, కరణం వాసుదేవరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ కరి రవిశేఖర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలు అందుకుంటున్న విద్యార్థినులు

రేపు సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్‌బాల్ పోటీలు

మార్టూరు,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్ బాల్ బాలబాలికల పోటీలు ఈ నెల 23 వతేదీన ఆదివారం మండలంలోని చిమ్మిరిబండలోని జడ్‌పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఏపీ అసోసియేషన్ ఉపకార్యదర్శి పిల్లి సురేంద్ర శుక్రవారం తెలిపారు.ఈ పోటీలను లీగ్ పద్ధతిలో నిర్వహిస్తారని, సాయంత్రానికి పోటీలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

నేడు వెలుగు సిబ్బందికి అవగాహన సదస్సు

ఇంకొల్లు,ఫిబ్రవరి 21,(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో ఇంకొల్లు క్లస్టర్‌లోని ఆరు మండలాల వెలుగు సిబ్బందికి శనివారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం అనూరాధ తెలిపారు.

బ్యాంకుల విలీనాలతో కుదేలు

● నిరసనలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం విలీనాలతో బ్యాంకింగ్ రంగం కుదేలవుతున్నదని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ చీరాల ప్రతినిధులు అన్నారు. శుక్రవారం విధులు ముగిశాక అన్ని బ్యాంకుల ప్రతినిధులు స్టేట్ బ్యాంకు ప్రాంగణానికి చేరుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ 25 ఏళ్లుగా నూతన రిక్రూట్మెంట్‌లు లేక పాత వారితోనే పని చేయిస్తూ పని భారాన్ని పెంచుతున్నారని వాపోయారు. మారుతున్న ఆధునీకరణలో భాగంగా ఉద్యోగులకు పని భారం పెరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వారంలో ఐదు రోజులు మాత్రమే పని దినాలుగా కేటాయించాలన్నారు. ఐడీబీఐ విలీనం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే మార్చి 24, 25 తేదీలలో దేశ వ్యాప్తంగా విధులు బహిష్కరించి ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు దీవెన బాబు, కిషోర్‌బాబు, నెహ్రూ, చైతన్య, ఆంజనేయులు, బ్రహ్మయ్య, దాసు, శ్రీనివాసరావు, పైడయ్య, ఏఐటీయూసీ నాయకులు బత్తుల శామ్యేల్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

విద్యుత్ మోటార్ల చోరీ దొంగల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని కావూరివారి పాలెంలో విద్యుత్ మోటార్లు చోరీకి పాల్పడిన దొంగలను ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అక్కల గోపిరెడ్డి, కావూరి గోపిరెడ్డిలు గ్రామంలోని పొలాల్లో ఉన్న ఐదు విద్యుత్ మోటార్‌లను చోరీచేశారు. రైతుల ఫిర్యాదు మేరకు ఈనెల 17వ తేదీన కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేశారు. అలాగే చోరీ జరిగిన మోటార్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న లారీ

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :వేటపాలెం మండల పరిధిలోని జాతీయ రహదారిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని లారీ వెనుక నుంచి ఎడ్ల బండిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎడ్ల బండి యజమానికి కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెంకు చెందిన మొగిలి కోటేశ్వరరావు ఎద్దుల బండితో జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా చీరాల - వేటపాలెం మధ్యగల జాతీయ రహదారిలో ప్రమాదం జరిగింది. అలాగే బండి కూడా ధ్వంసమైంది. దీంతో స్థానికులు 108 సహాయంతో క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన ఎడ్ల బండి యజమాని

మోటార్ సైకిల్‌ను ఢీ కొన్న ఆటో

● భార్యాభర్తతో పాటు కుమార్తెకు గాయాలు

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్ర జ్యోతి): మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఆటో ఢీ కొనటంతో భార్యాభర్తతో పాటు కుమార్తెకు గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు అద్దంకి మండలంలోని రామాయపాలెంకు చెందిన గాలి ఏసన్న భార్య, కుమార్తెతో కలిసి మోటార్‌సైకిల్ పై గురువారం రాత్రి అద్దంకి వస్తుండగా గుండ్లకమ్మ బ్రిడ్జి సమీపంలో దర్శి వైపు నుంచి అద్దంకి వస్తున్న ఫోర్ వీల్ ట్రాలీ ఆటో వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ఉన్న ముగ్గురికి గాయాలు అయ్యాయి. శుక్రవారం ఏసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

నేడు చీరాలలో ప్రజా దర్బార్

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నేడు చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించే ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, అర్జీదారులు హాజరయ్యే అవకాశం ఉంది. ఎమ్మెల్యే నేరుగా అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. అర్జీదారులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో హాజరుకావాలని ఇప్పటికే సూచించారు. అలాగే అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అధికారులు కూడా హాజరవుతుండటంతో ప్రజాసమస్యల పరిష్కారం సులువుగా ఉండే అవకాశం ఉంది. అందుకు సంబంధించి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఉదయం మునిసిపల్ సమావేశం హాలులో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.